PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 151 | విజయవాడ, ఆదివారం 1 జనవరి 2023 | 6 + 8 పేజీలు + స్నేహ పేజీలు వెల : రూ. 7. 00

Vol No | Vijayawada, Sunday 1 January 2023 | Rs



కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సిడ్నీలోని ఒపెరా హౌస్ హార్బర్ వంతెన వద్ద బాణా సంచా వెలుగులు

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు ప్రజాశక్తి

2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు

– సంపాదకులు

సంక్షేమానికి కోతలు వద్దు

- జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి
- జనవరి రెండోవారం నుండి సచివాలయాల వద్ద ధర్నా
- రాష్ట్ర ప్రజలకు సిపిఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

పెన్షన్లు, అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలలో కోతలు ఆపాలని, జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గం డిమాండు చేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన విజయవాడలో జరిగింది. ఈ సమావేశానికి పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి చేసిన తీర్మానాల వివరాలను పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం మీడియాకు విడుదల చేశారు. తొలుత రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంక్షేమ పథకాల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు ప్రభుత్వం నుండి నిరాశే ఎదురవుతోందని, సంక్షేమ పథకాలు, నవరత్నాల కింద పంపిణీ చేస్తున్న సహాయంలో కోత వల్ల ప్రజలకు అందాల్సిన పూర్తి ప్రయోజనాలు అందడం లేదని పేర్కొన్నారు. వయోవృద్ధులు, వితంతువులకు ఆదరవుగా ఉన్న పెన్షన్లలోనూ కోతలు పెడుతున్నారని, పింఛనుదారుల పేర్లతో ఆస్తులున్నట్లు తప్పుడు రికార్డులు చూపించడం, సెంటు, సెంటున్నర ఉన్న భూములను కూడా విస్తీర్ణం పెంచి నోటీసులిచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వివరించారు. 300 యూనిట్ల కరెంటు వాడకం ఉంటే పెన్షన్ ఇవ్వబోమని చెబుతున్నారని తెలిపారు. కుటుంబంలో ఒకరు ఏదో ఒక లబ్ది పొందుతున్నారని వికలాంగులకు పెన్షన్ కోత పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించారని, ఓటు వేయలేదని, మరొకపార్టీకి చెందిన వారనే పేరుతో కక్ష సాధింపులతో వేధించడానికి పెన్షన్లు, సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని బెదిరించడం పరిపాటిగా మారిందని వివరించారు. అమ్మఒడి లబ్ధిదారులకూ షరతులు పెట్టి 3.5 లక్షల మందికి కోత విధించారని వెల్లడించారు. ట్యాబ్‌ల పంపిణీ పేరుతో మరో ఐదులక్షల మందిని తగ్గిస్తున్నారని, అమ్మఒడి డబ్బుతో ట్యాబ్‌లు కొని కంపెనీలకు ప్రజాధనాన్ని కట్టబెడుతున్నారని తెలిపారు. వీటన్నింటివల్ల రానున్న కాలంలో సంక్షేమానికి పెద్ద దెబ్బతగులుతుందని సిపిఎం హెచ్చరించింది.

రేషన్ డిపోల్లో సంక్రాంతి పండుగ సరుకులు పంపిణీ చేయాలి

రేషన్ సరఫరా కూడా అగమ్య గోచరంగా మారిందని, కరోనా సమయం నుండి కేంద్రం ఇచ్చే ఉచిత బియ్యంలోనూ మోడీ ప్రభుత్వం కోతలు పెట్టడం దారుణమని పేర్కొన్నారు. గతంలో సంక్రాంతి, ఇతర పండుగల సందర్భంగా ఇచ్చే సరుకుల కిట్లు పంపిణీ చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పెన్షన్లు, ప్రజాపంపిణీ, సంక్షేమ పథకాల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా జనవరి 2వ వారంలో సచివాలయాల వద్ద రాయబారాలు, ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ దృష్టికి సమస్యల తీవ్రతను తీసుకెళ్తామని పేర్కొన్నారు.

నవంబరు 27నే ప్రారంభిస్తామన్న జగనన్న ఇళ్ల పరిస్థితి అతీగతీ లేకుండాపోయిందని వివరించారు. ఇల్లు కట్టడం పూర్తయితే తమకంటూ ఉండడానికి ఒక గూడు ఉంటుందని ఆశగా ఎదురు చూస్తున్న ప్రజలకు ఎటువంటి ఫలితం దక్కలేదని పేర్కొన్నారు. నిర్మాణాలకు ఇవ్వాల్సిన నిధులు సక్రమంగా అందడం లేదని, ఇంటి నిర్మాణానికి 1.80 లక్షలు ఎటూ సరిపోవని, ఐదులక్షలు మంజూరు చేస్తే తప్ప ఇల్లు పూర్తయ్యే పరిస్థితి మిగతా 2లో

ఎన్ఐఎ కేసుల పెరుగుదల

ఆల్‌టైమ్ రికార్డ్

- గతేడాది కంటే 19.67 శాతం ఎక్కువ

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) ఎన్నడూ లేనంత రికార్డు స్థాయిలో ఈ ఏడాది కేసులను నమోదు చేసింది. 2021లో 61 కేసులు నమోదు కాగా 2022లో 19.67 శాతం పెరిగి 73 కేసులు నమోదయ్యాయి. ఇది ఆల్‌టైమ్ రికార్డు. ఈ ఏడాది 456 మందిని అరెస్టు చేయగా, వారిలో 19 మంది పరారీలో ఉన్నారు. జమ్మూకాశ్మీర్, అస్సాం, బీహార్, ఢిల్లీ, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో తీవ్రవాదంతో ముడిపడిన కేసులు 35 నమోదు చేశారు. అలాగే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 10 కేసులు, ఈశాన్య రాష్ట్రాల్లో 5 కేసులు, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ)తో ముడిపడిన కేసులు 7 ఉన్నాయి. ఇవిగాక పంజాబ్‌లో 5 కేసులను ఎన్ఐఎ నమోదు చేసింది. గ్యాంగ్‌స్టర్, టెర్రర్, డ్రగ్ స్మగ్లింగ్‌కు సంబంధించి 3 కేసులు, తీవ్రవాదులకు నిధులు సమకూర్చిన ఆరోపణలతో ఒక కేసు, నకిలీ కరెన్సీ నోట్లకు సంబంధించి మరో 2 కేసులు నమోదయ్యాయి. 2022లో 368 మందిపై 59 చార్జిషీట్లను ఎన్ఐఎ దాఖలు చేసింది. 38 ఎన్ఐఎ కేసుల్లో తీర్పులు వెలువడ్డాయి. అవన్నీ నేరారోపణతో ముగిశాయి. 109 మందిని దోషులుగా నిర్ధారించిన కోర్టు కఠిన కారాగార శిక్ష, జరిమానాలు విధించింది. ఇదే ఏడాది ఆరుగురికి జీవిత ఖైదు కూడా విధించారు. మొత్తం మీద ఈ ఏడాది నేరారోపణ రేటు 94.39 శాతంగా ఉంది.

సచివాలయ ఉద్యోగులకు రుణ వసూళ్ల బాధ్యత

• వలంటీర్లకు కూడా • 10వ తేదీలోపు బ్యాంకులతో మ్యాపింగ్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకే బ్యాంకు రుణాల వసూళ్ల బాధ్యతను అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగులతో పాటు వాలంటీర్లను కూడా ఈ విధులకు వినియోగించనుంది. నూతన సంవత్సరంలో సంక్రాంతి పండుగ తరువాత కొత్త బాధ్యతలను సచివాలయ ఉద్యోగులు, వాలటీర్లు తీసుకోవాల్సివస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. జివిడబ్ల్యువి, విఎస్‌డబ్ల్యుఎస్ డైరక్టర్ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు.కలెక్టర్లతో పాటు మున్సిపల్ కమిషనర్లు, జిల్లా జిఎస్‌డబ్ల్యుఎస్ ఆఫీసర్లు, డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఎంపిడిఓలతో పాటు అన్ని లీడ్ బ్యాంక్ మేనేజర్లకు కూడా వీటి నకళ్ళకు పంపినట్లు తెలిసింది. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజలకు ఇచ్చిన రుణాల రికవరీలు బ్యాంకర్లు ఆశించిన స్థాయిలో లేవని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో బ్యాంకర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. జగనన్న తోడు, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ జగనన్న నగర్‌లాంటి పథకాలకు సంబందించి రుణాల వసూళ్లు చేయడంలో గ్రామ సచివాలయం ఉద్యోగులు, గ్రామ వాలంటీర్ల సహకారం కావాలని ఆ సమావేశంలో బ్యాంకర్లు ప్రభుత్వాన్ని కోరారు. .ఈనేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జనవరి 10లోగా తమ ప్రాంత బ్యాంకులతో మ్యాపింగ్ చేసుకోవాలని ఆదేశించింది. నిజానికి కొంతకాలంగా ఈ ప్రక్రియ జరుగుతున్నట్లు చెబుతున్నారు. సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు ఈ పనిలో ఉన్నారు. పతి బ్యాంక్ పరిధిలో ఇద్దరు లేక ముగ్గురు వాలంటీర్లు తప్పనిసరిగా మ్యాపింగ్ చేసుకోవాలని ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. ఈ ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. రుణాలు తీసుకున్న వారు సకాలంలో బ్యాంకులకు వాయిదా చెల్లింపులు సక్రమంగా చేసేలా చూడాలని ఆదేశించింది. దీనికోసం సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ఎప్పటికప్పుడు బ్యాంకులతో సమన్వయం చేసుకుంటూ, లబ్ధిదారులతో మాట్లాడుతూ రుణాలు చెల్లించేలా చూడాల్సిఉంది. అయితే, ఇప్పటికే వివిధ రకాల పనులు చేయాల్సివస్తోందన్న అభిప్రాయం సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లలో వ్యక్తమవుతోంది. మరోవైపు తాము పదేపదే చెప్పినా లబ్ధిదారులు రుణాలు చెల్లించకపోతే పరిస్థితి ఏమిటని కూడా వారు ప్రశ్నిస్తున్నారు.



(ఫైల్ ఫొటో)

జమ్మూ కాశ్మీర్‌లో ప్రాథమిక హక్కుల నిరాకరణ

- పునరుద్ధరించాలని సిజెఐకి మెహబూబా ముఫ్తీ లేఖ

• లోపలి పేజీలో..•

పాలస్తీనా తీర్మానంపై ఓటింగ్‌కు

భారత్ గైర్హాజరు

జెనీవా : పాలస్తీనియన్ల హక్కులను కాలరాస్తున్న ఇజ్రాయిల్ దాష్టీకంపై అంతర్జాతీయ న్యాయ స్థానం (ఐసిజె) అభిప్రాయం కోరాలన్న తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధుల సభ 87–26 ఓట్ల తేడాతో ఆమోదించింది. పాలస్తీనాకు ఎప్పుడూ బాసటగా నిలిచే భారత్ ఈ సారి ఓటింగ్‌కు గైర్హాజరైంది. కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇజ్రాయిల్‌లోని యూదు దుర్హంకార ప్రభుత్వంతో దోస్తీ కడుతూ, చిరకాల మిత్రులైన పాలస్తీనియన్లను దూరం పెడుతోంది. విదేశాంగ విధానాన్ని అమెరికా అనుకూల విధానంగా మార్చుతున్న మోడీ ప్రభుత్వం పాలస్తీనా విషయంలో తీసుకున్న ఈ వైఖరి తాలూకు పర్యవసానాలు భవిష్యత్తులో తీవ్రంగా ఉంటాయని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. పాలస్తీనా భూ భాగాన్ని 1967 నుంచి ఇజ్రాయిల్ కబళిస్తూ వస్తున్నది. చివరికి తూర్పు జెరూసలెం ను కూడా అది ఆక్రమించుకుంది. దీనికితోడు ఆక్రమిత పాలస్తీనియన్ ప్రాంతంలో పాలస్తీనీయుల మానవ హక్కులను బాహాటంగా హరిస్తున్నది. ఇజ్రాయిల్ దాష్టీకాలపై అంతర్జాతీయ న్యాయస్థానం అభిప్రాయం కోరాలని ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానించింది. ఈ తీర్మానాన్ని అమెరికా, ఇజ్రాయిల్‌తో సహా 26 దేశాలు వ్యతిరేకించాయి. జపాన్, మయన్మార్, ఫ్రాన్స్, బ్రెజిల్‌తో బాటు భారత్ తదితర దేశాలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి.

కార్డుదారులందరికీ ఉచిత బియ్యం

- నేటి నుంచి ఏడాదిపాటు అమలుకు ఆదేశాలు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

కేంద్రప్రభుత్వం ఎన్ఎఫ్ఎస్ఎ కార్డులన్నింటికీ ఉచితంగా బియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ కార్డులకు కూడా ఉచితంగా బియ్యం ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. నేటి నుంచి ఏడాదిపాటు రాష్ట్రంలోని బియ్యం కార్డుదారులందరికీ తమ అర్హత మేరకు ఉచిత బియ్యం లభిస్తాయి.

జాతీయ ఆహార భద్రతా చట్టం –2013 కింద ఎన్ఎఫ్ఎస్ఎ, ఎఎవై, పిహెచ్‌హెచ్ కార్డుదారులకు మరో ఏడాది ఉచితంగా బియ్యం పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. అదే తరహాలో ఎన్ఎఫ్ఎస్ఎ కాని కార్డులకు సైతం ఉచిత బియ్యం 2023 జనవరి నుంచి డిసెంబరు వరకు ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనరు అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సమాచారాన్ని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా సివిల్ సప్లై అధికారులు, ఎపిఎస్‌సిఎస్‌సిఎల్ ఎమ్‌డికి తెలిపారు. కందిపప్పు, పంచదార ఎప్పటి లాగేనే సబ్సిడీ ధరతో అమ్ముతారని తెలిపారు. రేషన్ షాపులు, ఎండియు వాహనాల వద్ద ఉచిత బియ్యం పంపిణీ గురించి తెలియజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించిన సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబరు 1967, 18004250082 నెంబరును సంప్రదించవచ్చని కమిషనరు పేర్కొన్నారు. ఉచిత బియ్యాన్ని దారిమళ్లించకుండా విజిలెన్స్‌శాఖ మానిటరింగ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎటువంటి ఫిర్యాదులు రాని విధంగా సమర్థవంతంగా ఉచిత బియ్యం పంపిణీకి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు, తహసీల్దార్లకు సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఆయా షాపు డీలర్లు, ఎండియు ఆపరేటర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



డిజిపిగా ముగ్గురికి

ప్రమోషన్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ముగ్గురు ఐపిఎస్ అధికారులకు డిజిపిలుగా, మరో ముగ్గురికి డిఐజిలుగా రాష్ట్రప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం అదనపు డైరెక్టర్ జనరల్‌గా ఉన్న పివి సునీల్‌కుమార్, మహేష్ దీక్షిత్, అమిత్‌గార్గ్‌కు ప్రమోషన్ ఇచ్చి డిజిపిగా నియమించింది. వీరిలో సునీల్ కుమార్ ప్రస్తుతం ఇంటిలిజెన్స్ అదనపు డిజిగా విధులు నిర్వహిస్తున్నారు. మహేష్ దీక్షిత్, అమిత్ గార్గ్ కేంద్ర సర్వీసుల్లో ఉన్నారు. రాష్ట్రప్రభుత్వం డిఐజిగా ఉద్యోగోన్నతి కల్పించిన వారిలో డాక్టర్ కోయ ప్రవీణ్, భాస్కర్ భూషణ్, ఆర్ఎన్ అమ్మిరెడ్డి ఉన్నారు.

పంట నష్టపోయిన

రైతులను ఆదుకోవాలి

- రైతు సమస్యల పరిష్కారానికి 5న కర్నూలులో మహా ధర్నా
- అఖిల పక్ష రైతు సంఘాల నేతలు

• లోపలి పేజీలో..•

మహబూబాబాద్ జిల్లాలో

ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొట్టిన గ్రానైట్ లారీ
- గ్రానైట్ రాళ్లు ఆటో మీద పడడంతో ఇద్దరు దుర్మరణం
- ఆరుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి– మహబూబాబాద్ (తెలంగాణ)

తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం శివారు అయ్యవారిపెల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. ఆటోను గ్రానైట్ లారీ ఢీకొట్టడంతో బండరాళ్లు మీద పడి ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శనివారం రాత్రి 7.30 గంటల సమయంలో మహబూబాదాద్ వైపు నుంచి భారీ బండరాళ్లతో గ్రానైట్ లారీ మరిపెడ వైపు వెళ్తోంది. ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో, గ్రానైట్ రాళ్ల తాళ్లు తెగి రాళ్లు ఆటోపై పడ్డాయి. ఆ సమయంలో ఆటోలో డ్రైవర్‌తోపాటు ఎనిమిది మంది ఉన్నారు. రాళ్లు మీదపడడంతో బానోత్ సుమన్ (35), యెక్కలపు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన డెన్యాల నవీన్‌ను వరంగల్ ఎంజిఎంకు పోలీసులు తరలించారు. లింగంపల్లి రాంబాబు, బానోతు రాము, ఆటో డ్రైవర్ బానోత్ రమేష్, నావత్ వీరన్న, బొడ్డు శేఖర్‌ను మానుకోట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చిన్నగూడూరు మండలం మంగోరిగూడెం నుంచి వారంతా మహబూబాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బండరాళ్ల కింద ఇంకెవరన్న ఉండొచ్చన్న అనుమానాలు ఉన్నాయి. నవీన్ పరిస్థితి విషమంగా ఉంది. మితిమీరిన వేగం, సరిగా రాళ్లను కట్టకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. క్రేన్ సహాయంతో బండరాళ్లను తొలగించి మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. మానుకోట ఏరియా ఆస్పత్రిలో బాధితుల కుటుంబాలను ఎంపి మాలోత్ కవిత, ఎమ్మెల్యే రెడ్యానాయక్, సాదుల శ్రీనివాస్, కెఎస్ఎన్ రెడ్డి, జిన్నా రెడ్డి, వెంకటేశ్వర్లు, ముల్లంగి ప్రతాప్ తదితరులు పరామర్శించారు. ఎస్‌పి శరత్‌చంద్ర, డిఎస్‌పి సదయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద దృశ్యం

రాజకీయ బేరగాడు

అమిత్ షాపై నిప్పులు చెరిగిన సిద్ధరామయ్య

బెంగళూరు : కేంద్ర హోంమంత్రి, బిజెపి నేత అమిత్ షాపై కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అవినీతి పరులను కొనుగోలు చేసి బిజెపిలో చేర్చుకొనే రాజకీయ బేరగాడు' అంటూ షాపై ఆయన నిప్పులు చెరిగారు. కర్ణాటక బిజెపిలోని పెద్దలంతా కమీషన్ల వసూలులో మునిగిపోయారని, ప్రభుత్వ నియామకాలు, బదిలీ వ్యవహారాలు, పదోన్నతులు, నిధుల కేటాయింపు, బిల్లుల చెల్లింపుల్లో 40 శాతం కమీషన్ దండుకుంటున్న వారిని కొనసాగిస్తూ మరోవైపు అవినీతి గురించి అమిత్ షా మాట్లాడటమంటే దయ్యాలు వేదాలు వల్లించడమేనని ఆయన విమర్శించారు. సామాజిక మాధ్యమాల్లో శుక్రవారం రాత్రి నుంచి ఆయన వరుస పోస్టులతో బిజెపి తీరుపై విరుచుకుపడ్డారు. 'రూ.2 వేల కోట్లకు ముఖ్యమంత్రి పదవిని అమ్మకానికి పెట్టిన రాజకీయ బేరగాడు' కాంగ్రెస్‌ను అవినీతి పార్టీగా ఆరోపించడం హాస్యాస్పదంగా అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. అవినీతిపరులకు సంపదను బహుమతిగా ఇస్తూ, విధాన సౌధను అవినీతికి అడ్డాగా మార్చింది బిజెపి ప్రభుత్వమేనని విమర్శించారు. 'రాష్ట్ర నేతలు దండుకుంటున్న 40 శాతం కమీషన్‌లో మీ వాటా ఎంత?' అని ప్రశ్నించారు. బిజెపి నేతలు డిమాండ్ చేసే 40 శాతం కమిషన్ కారణంగా రాష్ట్రంలో కొందరు కాంట్రాక్టర్లు ఆత్మహత్య కూడా చేసుకున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో.. మాండ్యాలో శుక్రవారం జరిగిన ఒక బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ కాంగ్రెస్, జెడియు అవినీతి పార్టీలంటూ ఆరోపణలు గుప్పించారు. దీంతో ప్రతిపక్ష జెడియు, కాంగ్రెస్ నేతలు ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రత్యారోపణలు సంధించారు.



బిజెపిని ఐక్యంగా తిప్పికొడదాం : రాహుల్

• లోపలి పేజీలో..•

'స్థానిక ఆర్థికవృద్ధి'తో మరో ముందడుగు

'విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి సామాజిక సూచీలలో కేరళ ప్రపంచస్థాయి ప్రమాణాలను అందుకుంది. అయితే, ఆర్థికా భివృద్ధి అంతగా జరగలేదు. కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఈ విషయాన్ని సమీక్షించింది. స్థానిక ఆర్థికాభివృద్ధిని సాధించడం ద్వారా ఆ లోపాన్ని అధిగమించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా యువతీయువకులు సొంతంగా ఆర్థిక కార్యక్రమాలు నిర్వహించేలా, పారిశ్రామిక యూనిట్లను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నాం. స్థానిక సంస్థలను భాగస్వాములను చేయడం ద్వారా ఈ కార్యక్రమం జరుగుతోంది. మధ్య ఆదాయ దేశాల సరసన కేరళ సమాజాన్ని నిలబెట్టడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఇది పూర్తయితే ఓ పెద్ద ముందడుగు వేసినట్టువుతుంది' అని కేరళ రాష్ట్ర స్థానిక స్వ పరిపాలన శాఖ మంత్రి ఎంబి రాజేష్ అన్నారు. మాకినేని బసవపున్నయ్య స్మారక ఉపన్యాసం ఇవ్వడానికి విజయవాడ వచ్చిన ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కేరళలో స్థానిక సంస్థల పనితీరు, అవి సాధిస్తున్న విజయాలను వివరించారు. ఇంటర్వ్యూ వివరాలు క్లుప్తంగా

ప్రజాశక్తితో కేరళ మంత్రి ఎం.బి. రాజేష్



(వి రాజగోపాల్)

ప్ర: మరే రాష్ట్రంలో లేని విధంగా కేరళలో స్థానిక సంస్థలకు ప్రాధాన్యత లభిస్తోంది. ఎందువల్ల?

జ: ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ సమాజం కూడా అభివృద్ధి సాధించదు. కమ్యూనిస్టు పార్టీ ఆ విషయాన్ని గుర్తించింది. ఎన్నో రైతాంగ, ప్రజా పోరాటాల ద్వారా కేరళలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ పోరాటాలకు జాతీయోద్యమ నేపథ్యం కూడా ఉంది. అందువల్ల అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు దిశా నిర్దేశం చేయడానికి వేసిన కమిటికీ మా రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఇఎంఎస్ నంబూద్రిపాద్ స్వయంగా నేతృత్వం వహించారు. అప్పటి నుండి స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశలో కృషి ప్రారంభమైంది. అయితే, కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నంబూద్రి ప్రభుత్వాన్ని రద్దు చేయడం, నిర్బంధం సాగించడం వంటి కారణాలతో పూర్తిగా సాగలేదు. 1996లో మళ్లీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి స్థానిక సంస్థలను బలోపేతం చేయడంపై దృష్టి సారించాం. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ స్థానిక ప్రభుత్వాలను భాగస్వాములను చేస్తున్నాం.

ప్ర: ఈ కృషి నిరాటంకంగా సాగుతోందా..?

జ: లేదు. మా రాష్ట్రంలో తరుచు ప్రభుత్వాలు మారే సంగతి తెలిసిందే. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ప్రభుత్వాలు ఏర్పడిన ప్రతిసారి స్థానిక సంస్థలను విస్మరించేవారు. వారు మాటలెన్ని చెప్పినా ఆచరణలో కేంద్రీకరణకే ప్రాధాన్యత ఇచ్చేవారు. స్థానిక సంస్థలకు అధికారాలను బదలాయించడానికి వారు వ్యతిరేకం. ఇకె నయనార్ హయంలో (1996) స్థానిక సంస్థల అభివృద్ధి కోసం మేం పెద్ద ఎత్తున ప్రజాప్రణాళికను రూపొందించాం. ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొని వారికి కావాల్సిన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకోవడం దీని లక్ష్యం. రాష్ట్ర వ్యాప్తంగా 96 లక్షల మంది ప్రజలు, 10 వేల మంది నిపుణులు, 14 వేల మంది ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ప్రజా ప్రణాళిక ఏ విధంగా రూపొందిందో అర్థం చేసుకోవడానికి ఈ అంకెలు చాలు. యుడిఎఫ్ దీనిని కూడా పక్కన పెట్టేసింది. అయితే, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ ప్రజా ప్రణాళికను రూపొందించి అమలు చేస్తూనే ఉన్నాం.

ప్ర: స్థానిక సంస్థలకు నిధుల పంపిణీ ఎలా చేస్తున్నారు?

జ: ఎల్‌పెఫ్ ప్రభుత్వం నిధుల పంపిణీకి ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. ప్రణాళిక నిధుల్లో కనీసం 25 శాతం నిధులు స్థానిక సంస్థలకు కేటాయించాలని నిర్ణయించాం. దీనిని ప్రతి ఏడాది 0.5శాతం పెంచుతున్నాం. గత ఏడాది 26 శాతం నిధులు కేటాయించగా ఈ ఏడాది 26.5 శాతం కేటాయిచాం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి 27 శాతానికి చేరుతుంది. ప్రణాళిక నిధులతో పాటే కేటాయింపులూ పెరుగుతుంటాయి.

ప్ర: కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు వస్తున్నాయా?

జ: స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రావడం దాదాపు ఆగిపోయింది. వాటికోసం మేం పదేపదే విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ ఫలితం ఉండటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నుండి క్రమం తప్పకుండా ఇస్తున్నాం. సాధ్యమైనంత వరకు స్వయంపోషకంగా ఉండేలా మిగతా 2లో

సబ్‌ప్లాన్ కొనసాగించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాను కొనసాగించాలని కెవిపిఎస్ కోరింది. అతి త్వరలో కాలపరిమితి ముగియనున్నందున ఈ అంశంపై ఆయనతో చర్చించేందుకు వీలైనంత త్వరగా అవకాశం కల్పించాలని సిఎంకు లేఖ రాసింది. ఈ మేరకు శనివారం మంత్రులు మేరుగ నాగార్జున, బాపట్ల ఎంపి నందిగం సురేష్‌ను నాయకులు ఆండ్ర మాల్యాద్రి, క్రాంతికుమార్ కలిసి విజ్ఞప్తి చేశారు.

బైపిసి విభాగంలో 93 శాతం సీట్లు భర్తీ

- ముగిసిన ఇఎపిసెట్ కౌన్సిలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఇఎపి సెట్ బైపిసి విభాగంలో 93.31 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఈ నెల 26 నుంచి ప్రారంభమైన తుదిదశ బైపిసి విభాగం కౌన్సిలింగ్ శనివారంతో ముగిసింది. అలాట్‌మెంట్ ఆర్డర్లను సెట్ కన్వీనర్ సిహెచ్ నాగరాణి శనివారం విడుదల చేశారు. మొత్తం 193 కళాశాలల్లో 10,738 సీట్లు ఉండగా, ఇందులో 10,665 సీట్లు భర్తీ అయ్యాయి. 74 సీట్లు భర్తీ కాలేదు. బి ఫార్మా కళాశాలల్లో 9,072 సీట్లు అందుబాటులో ఉండగా 9,012 సీట్లు భర్తీ అయ్యాయి. డి ఫార్మాలో 1,552 సీట్లు ఉండగా, 1,539 భర్తీ అయ్యాయి. ఇంజనీరింగ్ విభాగంలో 115 సీట్లు ఉండగా, 114 సీట్లు భర్తీ అయ్యాయి.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

చంద్రబాబును అరెస్టు చేయాలి

- కందుకూరు ఘటనపై మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కందుకూరు సభలో ఎనిమిదిమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనకు బాధ్యుడైన చంద్రబాబు నాయును అరెస్టు చేయాలని మంత్రి జోగి రమేష్ డిమాండ్ చేశారు. వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇరుకుసందులో సభ పెట్టి వారి చావుకు కారకుడయ్యారని, ఈ విషయం డిజిపికి చెబుతామని అన్నారు. ఎనిమిది మంది మరణించి 24 గంటలు కూడా గడవకుండానే ఎవరైనా సభ పెడతారా అని ప్రశ్నించారు. తన అధికారం కోసం ప్రజలు బలిదానం, త్యాగాలు చేయాలా అని నిలదీశారు. చంద్రబాబుకు దమ్ముంటే బిసిలపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు చంద్రబాబును నమ్మరని అన్నారు. 175 నియోజక వర్గాల్లో టిడిపి అభ్యర్థుల్ని నిలబెట్టే దమ్ముందా అని ప్రశ్నించారు. 2023లో జగన్ నాయకత్వంలో డిబిటి ద్వారా ప్రతి గడపకు దగ్గరయ్యేలా మరింత మేలు చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ తమ పార్టీ విజయదుందుబి మోగించబోతుందన్నారు.

పిడుగురాళ్లలో టిడిపి కార్యకర్తపై దాడి

- ఫ్లెక్సీల వివాదంలో స్వపక్షంలోనే గ్రూపుల వివాదం

ప్రజాశక్తి- పిడుగురాళ్ల (గుంటూరు జిల్లా)

పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో టిడిపిలో గ్రూపు పోరు రోజు రోజుకు ఉధృతమవుతోంది. శనివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గ్రూపు వారు మరో గ్రూపుపై దాడికి పాల్పడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన చింతలపూడి ఛారిటబుల్ ట్రస్టు అధినేత చింతలపూడి శ్రీనివాసరావు తమ్ముడు చింతలపూడి బాబుపై యరపతినేని అనుచరులు టిడిపి కార్యాలయం వద్ద కొట్టి గాయపరిచారు.

యరపతినేనిని వ్యతిరేకిస్తున్న డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాసరావు వచ్చే ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసేందుకు పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, లోకేష్‌ను ఇటీవల కలిశారు. ఆ తరువాత నియోజకవర్గంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీల ఏర్పాటును జీర్ణించుకోని యరపతినేని అనుచరులు చల్లగుండ్ల శ్రీనివాసరావు వేసిన ఫ్లెక్సీలను తొలగించి అదే స్థానంలో యరపతినేని శ్రీనివాసరావు, చంద్రబాబునాయుడు, లోకేష్ ఉన్న ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీంతో యరపతినేని అనుయాయులకు, చల్లగుండ్ల శ్రీనివాసరావు అనుయాయులకు మధ్య మాటలయుద్ధం జరుగుతోంది. ఈ నేపథ్యంలో చల్లగుండ్ల శ్రీనివాసరావు సమీప బంధువు చింతలపూడి బాబు శనివారం సాయంత్రం యరపతినేని కార్యాలయం వద్దకు రాగానే ఆయనపై దాడి చేసి గాయపర్చారు. ఈ మేరకు పోలీసులకు బాబు ఫిర్యాదు చేశారు.

కార్మిక వర్గంపై ప్రభుత్వాల దాడి

- పోరాటానికి సిద్ధం కావాలి
- నాలుగో రోజు కార్మిక చైతన్య యాత్రలు



గుంటూరులో జాతాకు స్వాగతం పలుకుతున్న టింబర్ ముఠా కార్మికులు

ప్రజాశక్తి - యంత్రాంగం

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగే సిఐటియు రాష్ట్ర 16వ మహాసభను పురస్కరించుకుని చేపట్టిన కార్మిక చైతన్య యాత్రలు శనివారం నాలుగో రోజూ కొనసాగాయి. ప్రకాశం, గుంటూరు, బాపట్ల, కృష్ణా, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో కొనసాగిన యాత్రలకు విశేష స్పందన వచ్చింది. ఆయా జిల్లాల్లో చేపట్టిన ర్యాలీలు, ప్రజానాట్యమండలి కళాకారుల గీతల మధ్య యాత్ర కొనసాగింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడారు. కార్మికులను బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. వీటి వల్ల కార్మికులకు ఉన్న కొద్దిపాటి హక్కులు కూడా కనమరుగు అవుతాయని తెలిపారు.

కార్పొరేట్లకు కార్మికులను బానిసలుగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. కార్మిక వర్గం ఐక్యమైతే ప్రభుత్వాలు స్తంభించిపోతాయనే విషయాన్ని గుర్తురిగేలా ఐక్యపోరాటాల ద్వారా తెలియజేయాలని పిలుపునిచ్చారు. సమ్మె చేసేందుకు, యూనియన్లు పెట్టుకునేందుకు హక్కులు లేకుండా కార్మికులను అణచివేస్తున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రకాశం, బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాలో నిర్వహించి సభలనుద్దేశించి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యదర్శి స్వరూపరాణి, ఆర్‌వి.నరసింహారావు మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చిన తర్వాత ఎన్నడూ లేని విధంగా కార్మిక వర్గంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయడం లేదని తెలిపారు. రానున్న రోజుల్లో బిజెపి, వైసిపి విధానాలను వ్యతిరేకంగా సమరశీల పోరాటానికి సన్నద్ధం కానున్న నేపథ్యంలో ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులేష్, కెవిపిఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాధలో ఉంటే విమర్శలా?

- 'కందుకూరు' ఘటనలో రాజేశ్వరి కుటుంబ సభ్యులకు చంద్రబాబు పరామర్శ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో/ నెల్లూరు ప్రతినిధి

కందుకూరు ఘటనలో ఎనిమిది మంది కుటుంబ సభ్యులను కోల్పోవడం బాధాకరమని టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నెల్లూరు జిల్లా కందుకూరులో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన ఈదుమూడి రాజేశ్వరి కుటుంబ సభ్యులను చంద్రబాబు నాయుడు శనివారం పరామర్శించారు. ప్రకాశం జిల్లా కొండపి మండలం పెట్లూరులో మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి.. వారికి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారికి పార్టీ తరపున రూ.15 లక్షల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. కందుకూరు ఘటన బాధాకరమని పేర్కొన్నారు. బాధ్యతగా వ్యవహరించాల్సిన పోలీసులు సభకు వేలాదిగా టిడిపి కార్యకర్తలు వస్తారని తెలిసి కూడా రక్షణ కల్పించలేదని విమర్శించారు. నందిగామలో జరిగిన సభలో తనపై రాయి విసిరితే పోలీసులు సీరియస్‌గా తీసుకోలేదన్నారు. కర్నూలులో వైసిపి మూకలు వస్తే పోలీసులు పట్టించుకోలేదని తెలిపారు. కందుకూరు ఘటన సమయంలో తాను అప్రమత్తం చేశానని తెలిపారు. పోలీసులు ఎక్కడా కనిపించలేదని, వెంటనే బాధితులను చూసేందుకు ఆస్పత్రికి వెళ్లానని తెలిపారు. సభను రద్దు చేసుకున్నానని, పార్టీ ద్వారా, నేతల ద్వారా కలిపి రూ.25 లక్షల ఆర్థిక సాయం బాధిత కుటుంబాలకు ఇచ్చామన్నారు. ఎనిమిది మంది కార్యకర్తలను కోల్పోయి బాధలో ఉంటే, వైసిపి నాయకులు నీతి మాలిన విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. వీళ్లు మనుషులేనా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కచ్చలూరు బోటు ప్రమాదం జరిగినా, అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయినా కూడా జగన్ వెళ్లలేదని విమర్శించారు. జగన్ పాలనలో 2022 విధ్వంసాల పాలనగా మిగిలిపోయిందని, 2023లో బాధలన్నీ తొలగిపోయి అందరికి మంచి జరగాలని చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.



ప్రకాశం జిల్లా పెట్లూరులో రాజేశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చంద్రబాబు

అంతకు ముందు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రాజుపాళెంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రం కోసం, పార్టీ కోసం త్యాగాలు చేయడం మా నేతలకు కొత్తేమీ కాదు. అవసరాన్ని బట్టి పదవులు త్యాగాలు చేస్తారు" అని అన్నారు. సమర్థులకు అవకాశం ఇస్తామని తెలిపారు. ఎపి జెన్‌కో ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన దగ్గర నుంచి ప్రతీఏడాదీ విధ్వంసాలేనని అన్నారు. మీడియా సహా వివిధ సంస్థలపై దాడి చేస్తున్నారని, సిఐడి కేసులతో వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలు, కరెంట్ ఛార్జీలు మన రాష్ట్రంలోనే అధికంగా ఉన్నాయన్నారు. దేశంలో రైతులపై అత్యధిక అప్పున్న రాష్ట్రం ఎపినే అని విమర్శించారు. రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం మూడో స్థానంలో ఉందన్నారు. రాష్ట్రం గంజాయి హబ్‌గా మారి మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. నిరుద్యోగుల్లో నిరుత్సాహం, నిస్సహాయత నెలకొందన్నారు. అందుకే యువత ఆత్మహత్యలు చేసుకుంటోందని తెలిపారు. విద్యా వ్యవస్థను నాశనం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో 2.70 లక్షల టిడ్కో ఇళ్లు నిర్మించామని, 90 శాతం పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించకుండా జగన్ తుప్పు పట్టించారని అన్నారు. విధ్వంసాల పాలనకు వ్యతిరేకంగా లోకేష్ పాదయాత్ర కొనసాగుతుందని, ఎవరో బెదిరిసే ఆగదన్నారు. సమావేశంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డిచంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన 'జిఎన్ఎస్ఎస్' విస్తరణ పనులు!

- రూ.2,162 కోట్లతో సా..గుతున్న వైనం
- 82 వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకం



జిఎన్ఎస్ఎస్ ప్రధాన కాల్వ విస్తరణ పనులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

గాలేరు-నగరి సుజల స్రవంతి (జిఎన్ఎస్ఎస్) కాలువ విస్తరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఈ కాలువ ద్వారా కడప, అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు జిల్లాలోని 3.05 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించవచ్చు. కర్నూలు జిల్లా అవుకు నుంచి ప్రారంభమైన ఈ కాలువ నెల్లూరు జిల్లా వరకు మొత్తం 119 కిలోమీటర్లు. ప్రతి ఏటా వర్షాకాలంలో 19 నుంచి 26 రోజుల పాటు కృష్ణా నదికి పోటెత్తే వరద నీటిని సద్వినియోగం చేసుకునేందుకు ఈ కాల్వను నాలుగు వేల క్యూసెక్కుల నుంచి ఆరువేల క్యూసెక్కులకు విస్తరించాలనేదే ముఖ్య ఉద్దేశం.

జిఎన్ఎస్ఎస్ కెనాల్- హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కెనాల్ లిఫ్టు స్కీమ్ ద్వారా అనుసంధాన ప్రతిపాదన నేపథ్యంలో ప్రధాన కాల్వ విస్తరణ పనులకు 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కాల్వ విస్తరణతో జిఎన్ఎస్ఎస్ కెనాల్‌లో అంతర్భాగమైన గండికోట రిజర్వాయర్‌ను 25.85 టిఎంసిలతో సకాలంలో నింపవచ్చు. 0-119 కిలోమీటర్ల వరకు పనులు చేపట్టేందుకు గత టిడిపి ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఎన్నికల అనంతరం వైసిపి అధికారంలోకి రావడంతో రివర్స్ టెండరింగ్ పేరుతో 25 శాతం పూర్తి చేయని టెండర్లను రద్దు చేసింది.

2023 ఆగస్టు నాటికి పనులను పూర్తి చేయాలని 2021లో రూ.2,162 కోట్లతో వైసిపి ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఫేజ్-1 కేటగిరీలోని ప్యాకేజీ-1 కింద 0 కి.మీ నుంచి 34 కి.మీ పనులను రూ.175 కోట్ల కాంట్రాక్టును ఎస్ఎల్ఆర్ కంపెనీ దక్కించుకుంది. 32 కి.మీ పరిధిలో 40 శాతం పనులను మాత్రమే పూర్తి చేసింది. ప్యాకేజీ-2 కింద 34 కి.మీ నుంచి 56 కి.మీ వరకు రూ.130 కోట్లతో కూడిన పనులను పిఎల్ఆర్ కాంట్రాక్టు సంస్థ దక్కించుకుంది. 60 శాతం మాత్రమే పనులను పూర్తి చేసింది. కీలకమైన 41.55 కి.మీ వద్ద 1100 మీటర్ల మొగమేరు అక్విడెక్ట్ ప్రతిపాదనలు ఫైనాన్స్ డిపార్టుమెంట్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. ప్యాకేజీ-1, 2 పనులను సకాలంలో పూర్తి చేస్తే సర్వారాయసాగర్, వామికొండ రిజర్వాయర్ల కింద 36 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది.

జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కింద ప్యాకేజీ-1 కింద 34 కి.మీ నుంచి 66 కి.మీ మేర పనులకు రూ.372 కోట్లతో టెండర్లు నిర్వహించింది. ఇందులో 23 స్ట్రక్షర్లు, బ్యాలెన్స్ కెనాల్ పనులను చేపట్టాల్సి ఉంది. ఈలెక్కన 90 శాతం మేరకు పనులు పూర్తి చేసింది. ప్యాకేజీ-2 కింద 66 కి.మీ నుంచి 96 కి.మీ వరకు రూ.320 కోట్లతో కూడిన టెండర్‌ను ఎంఆర్‌కెఆర్ కాంట్రాక్టు సంస్థ దక్కించుకుంది. 10 కి.మీ పరిధిలోని 32 స్ట్రక్షర్లు, ఎర్త్‌వర్క్ పనులను మాత్రమే పూర్తి చేసింది. 250 ఎకరాల భూసేకరణ క్లియరెన్స్ సెకెండ్‌స్టేజ్‌లో ఉంది. రూ.21.21 కోట్లు చెల్లింపులు చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దీని కింద 12 వేల ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్యాకేజీ -3 కింద 96 కి.మీ నుంచి 119 కి.మీ వరకు రూ.1165 కోట్ల టెండర్‌ను ఐవిఆర్‌సిఎల్ కంపెనీ దక్కించుకుంది. పనుల్లో మందగమనం వంటి కారణాలతో 60(సి) కింద రైసా కంపెనీ పనులను చేపట్టింది. ఈ కాలువ కింద 1072 ఎకరాల భూసేకరణ స్టేజ్-2 క్లియరెన్స్ దశలో ఉంది. రూ.72 కోట్లను చెల్లింపులు చేయడంలో తాత్సారం చేయడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీని కింద 25 వేల ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి రానుంది. వైఎస్ఆర్ జిల్లాలోని వీరపునాయనిపల్లె, పెండ్లిమర్రి, నందలూరు, రైల్వేకోడూరులో ఫారెస్టు అనుమతులు రావాల్సి ఉంది. ఫారెస్ట్ క్లియరెన్స్, భూ సేకరణలో జాప్యం వల్ల పనులు సకాలంలో పూర్తి కావడం లేదు.

2023 అక్టోబర్‌లో సాగు నీరందిస్తాం

జిఎన్ఎస్ఎస్ ప్రధాన కాల్వ విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. 2023 ఏప్రిల్ - ఆగస్టు నాటికి ప్యాకేజీల గడువు ముగింపు దశకు చేరనుంది. ఒప్పంద గడువులను పొడిగింపు చేసి 2023 అక్టోబర్ నాటికి 20 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందిస్తాం.

- ఎం.మల్లికార్జునరెడ్డి, ఎస్ఇ, జిఎన్ఎస్ఎస్, కడప.

'స్థానిక ఆర్థికవృద్ధి'తో మరో ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

సొంత ఆదాయ వనరులను పెంచుకునేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. దీనికి ప్రజల నుండి సహకారం లభిస్తోంది.

ప్ర: ప్రస్తుతం మీ ప్రాధాన్యతలేంటి?

జ: ఇప్పుడు మేము స్థానిక ఆర్థిక అభివృద్ధి (లోకల్ ఎకనామిక్ గ్రోత్)ని సాధించడానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. స్థానిక సంస్థలను కేంద్రంగా చేసుకుని ఈ కార్యక్రమం సాగుతుంది. నాలెడ్జి బేస్డ్ ఆర్థిక వ్యవస్థగా కేరళను తీర్చి దిద్దడం దీని లక్ష్యం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచడం దీని లక్ష్యం. ఉత్పత్తి, సేవా రంగాలతో పాటు వివిధ రకాల సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా రానున్న నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని భావిస్తున్నాం. దీనికోసం కేరళ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ స్ట్రాటజీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశాం. ఇది స్థానిక సంస్థలతో కలిసి పనిచేస్తుంది. ఇటీవల పరిశ్రమల శాఖ ఏడాదిలో లక్ష సంస్థలను ఏర్పాటు చేయడాన్ని లక్ష్యంగా ప్రకటించింది. ఇది చాలా పెద్ద లక్ష్యంగా కనిపించవచ్చు. కానీ, స్థానిక సంస్థల సహకారంతో 9 నెలల్లోనే దాదాపుగా ఆ లక్ష్యాన్ని సాధించాం. 6,098 కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. 2.83 లక్షల ఉద్యోగాలను సాధించాం. ఇవి భారీ సంస్థలు కావు. అన్నీ సూక్ష్మ స్థాయి సంస్థలే! గతంలో స్థానిక సంస్థలు ఈ తరహా కార్యక్రమాలకు దూరంగా ఉండేవి. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థకు అవే కేంద్రంగా మారుతున్నాయి.స్థానికంగా ఆర్థికాభివృద్ధి చర్యలు చేపట్టడం, దాని ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించడం, అంతిమంగా ఆదాయాన్ని రాబట్టడం. కేరళ ఆదాయాన్ని ప్రపంచంలోని మధ్య ఆదాయ దేశాల స్థాయికి చేర్చడం ఈ కార్యక్రమం మొత్తం లక్ష్యం. దీని వల్ల స్థానిక సంస్థలు కూడా లబ్ధిపొందుతాయి. మేము ఇప్పటికే వివిధ సామాజిక సూచీలలో అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా ఉన్నాం.

ప్ర: పట్టణీకరణ సమస్యలు ఉన్నాయా...? వాటిని ఎలా పరిష్కరిస్తున్నారు?

జ: మా రాష్ట్రంలో పెద్ద ఎత్తున పట్టణీకరణ జరుగుతోంది. దశాబ్దకాలంలో దేశ వ్యాప్తంగా 2.57 శాతం, ప్రపంచ వ్యాప్తంగా 2.9 శాతం పట్టణీకరణ జరగ్గా అదే సమయంలో కేరళలో 6.58 శాతం జరిగింది. 2031 నాటికి 95 శాతం కేరళ జనాభా పట్టణాలకు చేరుకుంటారని అంచనా! దీనిని దృష్టిలో ఉంచుకుని పట్టణీకరణ సమస్యల పరిష్కారంకోసం ఒక సమగ్ర విధానం రూపొందించడంపై దృష్టి సారించాం. సాధ్యమైనంత త్వరలోనే ఇది సిద్ధమౌతుంది. ప్రజలపై భారాలు మోపే కేంద్ర ప్రభుత్వ విధానం మాదిరి ఇది ఉండదు. పట్టణ సమస్యల పరిష్కారానికి కేరళ చూపే ప్రత్యామ్నాయ విధానంగా ఉంటుంది.

ప్ర: ఆర్థిక వృద్ధి లక్ష్యాల సాధనలో మహిళలను ఎలా భాగస్వాములను చేస్తున్నారు?

జ: కుడుంబ శ్రీ (డ్వాక్రా) ప్రారంభమై ఈ ఏడాదితో 25 సంవత్సరాలు పూర్తవుతున్నాయి. పేదరిక నిర్మూలన స్థాయినుంచి ఆర్థిక స్థిరత్వం కోసం ప్రస్తుతం ఈ గ్రూపులు పనిచేస్తున్నాయి. నూతన లక్ష్యంలో భాగంగా కుడుంబ శ్రీలోనే 'షీ స్టార్ట్స్' గ్రూపులను ఏర్పాటు చేస్తున్నాం. చదువుకున్న యువతులతో ఏర్పాటవుతున్న ఈ గ్రూపులు వాణిజ్య లక్ష్యాలతో సంస్థలను ఏర్పాటు చేసి నడుపుతున్నాయి. కుడుంబ శ్రీలో 46 లక్షల మంది సభ్యులుండగా, కొత్తగా ఏర్పాటు చేస్తున్న షీ స్టార్ట్స్'లలో ఇప్పటికే మూడు లక్షల మంది యువతులు నమోదు చేసుకున్నారు. అదే విధంగా ఇప్పటికీ తీవ్ర పేదరికంలో ఉన్న వారిని గుర్తించి, వారిని ఆ ఊబిలోంచి బయటకు తీసుకురావడానికి కృషి చేస్తున్నాం. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ అమలు కోసం జనాభా నిష్పత్తికన్నా ఎక్కువ నిధులు కేటాయిస్తున్నాం. దేశంలో అంతమొత్తం నిధులు కేటాయిస్తున్న రాష్ట్రం కేరళ ఒక్కటే!

కొత్త సంవత్సరంలో ఉజ్వల భవిత

- ప్రముఖుల ఆకాంక్ష

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

కొత్త సంవత్సరంలో జీవితం ఉజ్వలంగా ఉండాలంటూ పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

నూతన సంవత్సరంలో ఉజ్వల భవిష్యత్తు : గవర్నర్

రాష్ట్ర పౌరులందరూ ఉజ్వల భవిష్యత్తు కోసం ఎదురుచూడటానికి, కొత్త అవకాశాలను అన్వేషించడానికి, నూతన లక్ష్యాలను సాధించడానికి కొత్త సంవత్సరం ప్రేరణనిస్తుందని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు.

ఉజ్వల భవిష్యత్తు కోసం సంక్షేమ అజెండా : సిఎం జగన్

నూతన సంవత్సరం ప్రతి ఇంట్లో ఆరోగ్యం, ఆనందాన్ని నింపాలని ఆకాంక్షిస్తూ మెరుగైన ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి అజెండాను కొనసాగిస్తుందని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

సత్సంకల్పంతో ముందుకు : చంద్రబాబునాయుడు

నూతన సంవత్సర వేళ సత్సంకల్పంతో ముందుకు వెళ్దామని, అభివృద్ధి, ఆనందం, ఆరోగ్యంతో కూడిన మార్పును అందుకుందామని టిడిపి అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.

తెలుగు వారందరికీ సుసంపన్నమైన భవిష్యత్తు : పవన్‌కల్యాణ్

కొత్త సంవత్సరం తెలుగు వారందరికీ సుసంపన్నమైన భవిష్యత్తు, చక్కటి ఆరోగ్యం అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.



ఉక్కు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పుణ్యవతి

స్ఫూర్తిదాయకం.. 'ఉక్కు' ఉద్యమం

- ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమానికి మద్దతుగా ఐద్వా విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విశాఖలోని ముస్తాఫాజంక్షన్ నుంచి కూర్మన్నపాలెంలోని ఉక్కు దీక్షా శిబిరం వరకూ శనివారం ప్రదర్శన నిర్వహించారు. కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో ఐద్వా జాతీయ మహాసభ జరుగుతున్న నేపథ్యంలో ఉక్కు పోరాట జ్యోతిని శిబిరం వద్ద వెలిగించారు. దీన్ని తిరువనంతపురం తీసుకువెళ్తున్నట్టు నేతలు తెలిపారు. అనంతరం దీక్షా శిబిరం వద్ద నిర్వహించిన సభలో పుణ్యవతి మాట్లాడుతూ విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం జరుగుతోందని తెలిపారు. 32 మంది బలిదానం, వేలాది ఎకరాల భూమి త్యాగం చేసి ఎంతో మంది నిర్వాసితులయ్యారని గుర్తు చేశారు. చారిత్రక పోరాట నేపథ్యం ఉన్న స్టీల్‌ప్లాంటును అమ్మేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని తమ సంఘం జాతీయ మహాసభలో పిలుపునిస్తామని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలే దేశానికి పట్టుగొమ్మలని, అటువంటి కొమ్ములను బిజెపి ప్రభుత్వం విరిచేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్యను మోడీ ప్రభుత్వం పరిష్కరించాల్సిందిపోయి పెంచుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఉంటేనే మహిళలకు ఉద్యోగావకాశాలు దక్కుతాయని వెల్లడించారు. ప్రయివేటీకరణ జరిగితే ఉద్యోగాల్లో మహిళా రిజర్వేషన్ ఉండదని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి ఉందన్నారు. నేటి ఉద్యమం ప్రజా ఉద్యమంగా మారాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, నాయకులు కె.వరలక్ష్మి, కె.వేణు, ఆర్.విమల పాల్గొన్నారు.

గ్రూప్-1కు 1.26లక్షల మంది దరఖాస్తు

- ఒక్కో పోస్టుకు 137 మంది పోటీ
- 18 జిల్లాల్లో 297 పరీక్ష కేంద్రాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) విడుదల చేసిన గ్రూప్-1 పోస్టులకు 1,26,449 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 92 గ్రూప్-1 పోస్టుల భర్తీకోసం సెప్టెంబర్ 30న ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్ విషయం తెలిసిందే. ఒక్కో పోస్టులకు సుమారు 137 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ పోస్టులకు ఈ నెల 8వ తేదిన స్క్రీనింగ్ టెస్టును ఎపిపిఎస్‌సి నిర్వహించనుంది. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లాల్లో 297 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కమిషన్ కార్యదర్శి హెచ్ అరుణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను కమిషన్ వెబ్‌సైట్ జూం౬.ఖజా.స్త్రశీజ.ఱఅలో ఉంచామని, డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని వెల్లడించారు. జిల్లాల వారీ పరీక్షా కేంద్రాల వివరాలు, ప్రశ్నాపత్రం బుక్‌లెట్ నింపేందుకు సంబంధించిన సూచనల నమూనా కాపీలు, ఓఎంఆర్ షీట్లను కూడా వెబ్‌సైట్‌లో పొందుపరిచిన్నట్లు తెలిపారు. హాల్ టిక్కెట్లను ముందుగానే డౌన్‌లోడ్ చేసుకొని నిబంధనలు, సూచనలను తెలుసుకొని సరైన సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షలు నిర్వహించనున్న 18 జిల్లాల కలెక్టరేట్ల వద్ద ఈ నెల 6వ తేది నుంచి కంట్రోల్ రూములను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాలు తెలుసుకునేందుకు అభ్యర్థులు కంట్రోల్ రూములను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

ఇంటర్ కళాశాలల గుర్తింపు దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల గుర్తింపు రెన్యువల్, అదనపు తరగతి గదుల అనుమతికి సంబంధించిన దరఖాస్తుల గడువును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఈ మేరకు బోర్డు కార్యదర్శి ఎంవి శేషగిరి బాబు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24 విద్యాసంవత్సరానికి జూనియర్ కళాశాలల రెన్యువల్, అదనపు తరగతుల అనుమతులు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 10వ తేది వరకు స్వీకరిస్తామని పేర్కొన్నారు. అఫిలియేషన్ ఫీజు చెల్లింపు తేదిని కూడా ఈ నెల 4వ తేది వరకు పొడిగించిన్నట్లు తెలిపారు.

సంక్షేమానికి కోతలు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

లేదని పేర్కొన్నారు. పరిశ్రమల పేరుతో లక్షల ఎకరాలు తీసుకుని దుర్వినియోగం చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం పేదలు ఇల్లు కట్టుకోకపోతే ఇచ్చిన స్థలం వెనక్కు తీసేసుకుంటామని బెదిరించడం ఏ రకంగా న్యాయమని ప్రశ్నించారు. జగనన్న కాలనీలకు పార్టీ ఆధ్వర్యంలో వెళ్లి పరిశీలించి వాస్తవాలను వెల్లడించే కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర కార్యదర్శివర్గం నిర్ణయిచింది.

సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలి

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాను నిధులు దారి మళ్లించకుండా దళితవాడల అభివృద్ధికే ఖర్చుచేయాలని, చట్టం గడువు తీరనున్న నేపథ్యంలో గడువును పెంచాలని సిపిఎం డిమాండు చేసింది. నోడల్ ఏజెన్సీల ద్వారా సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా ఖర్చయ్యేలా చర్యలు తీసుకోవాలని, దళితుల, గిరిజనుల సంక్షేమానికి వాడవలసిన నిధులను ఉమ్మడి పథకాలకు మళ్లించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. సబ్‌ప్లాన్ నిధుల్లో 58 శాతం మాత్రమే ఖర్చయ్యాయని, ఇప్పటికింకా సరైన తాగునీరు, రోడ్లూ నోచని దళిత వాడలు, గిరిజన గూడేలు, తండాలు చాలా ఉన్నాయని పేర్కొంది. ఇతర ప్రాంతాలతో సమానంగా దళిత వాడలు, ఏజెన్సీ ప్రాంతాలూ అభివృద్ధి చెందే వరకు సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలని కోరింది. సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేసి దళిత, గిరిజనుల సంక్షేమ పథకాలకే ఖర్చు చేయాలని డిమాండ్ చేసింది. అన్ని దళిత, గిరిజన ప్రజా సంఘాలను భాగస్వాములుగా చేసి సబ్‌ప్లాన్ చట్టం పటిష్టంగా అమలయ్యేలా, నిధులు మంజూరు, ఖర్చు సక్రమంగా జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని కోరింది. సబ్‌ప్లాన్ కొనసాగింపు కోసం సాగే ఆందోళనకు సిపిఎం పూర్తి మద్దతు ప్రకటించింది. సంక్షేమ పథకాలకు కేటాయించాల్సిన నిధులు నిర్దిష్టంగా ఆయా పథకాలకే కేటాయించాలని, నవరత్నాలకు మళ్లించరాదని డిమాండ్ చేసింది.

భూదేవి కాంప్లెక్ టోకెన్ల కేంద్రంలో స్వల్ప తొక్కిసలాట


ప్రజాశక్తి- తిరుమల

వైకుంఠ ఏకాదశి ఎస్ఎస్‌డి దర్శన టికెట్ల క్యూలైన్‌లో శనివారం స్వల్ప తొక్కిసలాట చోటుచేసుకుంది. తిరుపతిలోని అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద టోకెన్ల మంజూరు కేంద్రంలో టికెట్లు మంజూరు చేస్తున్నారు. టిటిడి విజిలెన్స్ సిబ్బంది గేట్లను వేసి ఉండగా వాటిని భక్తులు తోసుకుని ముందుకు వెళ్లడంతో తొక్కిసలాట జరిగిందని భక్తులు తెలిపారు. దీనిపై టిటిడి అధికారులు వివరణ ఇచ్చారు. ఆదివారం నుండి ఐదు లక్షల టికెట్లు 11 రోజులకు ఇవ్వనున్నాని తెలిపారు. ఈ టికెట్ల కోసం భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారని తెలిపారు.

ఈ క్రమంలో స్వల్పతోపులాట జరిగిందన్నారు. సోమవారం ఏకాదశినాడు విశిష్టత ఉండడంతో గోవింద మాలలు వేసుకుని సుదూర ప్రాంతాల నుండి కాలినడకన వస్తున్నారని తెలిపారు. భక్తులకు టిటిడి అధికారులు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- రైతు సమస్యల పరిష్కారానికి 5న కర్నూలులో మహా ధర్నా
- అఖిలపక్ష రైతు సంఘాల నేతలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నకిలీ విత్తనాలు, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిలపక్ష రైతు సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలులోని కార్మిక కర్షక భవనంలో అఖిలపక్ష రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం రాష్ట్ర సమితి అధ్యక్షులు పి.రామచంద్రయ్య, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు మల్లికార్జున, తెలుగు రైతు సంఘం రాష్ట్ర నాయకులు కేశవరెడ్డి పాల్గొని మాట్లాడారు. గత ఏడాది ఖరీఫ్‌లో వేసిన పత్తిపంట దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నాలుగు లక్షల ఎకరాలలో పత్తి పంటను సాగు చేసినట్లు చెప్పారు. దీన్ని అదునుగా చూసుకున్న విత్తన కంపెనీలు బిటి కాటన్ విత్తనాలలో కల్తీ విత్తనాలను కలిపి రైతులకు అంటగట్టినట్లు తెలిపారు. దీని వలన రైతులు పంట దిగుబడిరాక విపరీతంగా నష్టపోయారన్నారు. ఒక్కో రైతు ఒక ఎకరాకు రూ.50 వేల నుండి రూ.60 వేల వరకు ఖర్చు చేసి నష్టపోయినట్లు తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకూ రాజకీయాలకతీతంగా పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని, ప్రయివేటు కంపెనీలతో కాకుండా ప్రభుత్వమే ఎపి సీడ్స్ ద్వారా విత్తనాలు అందించాలని, ఆర్‌బికెల ద్వారా విత్తనాలు ఇవ్వాలని, నకిలీ విత్తనాలు సరఫరా చేసే కంపెనీలను బ్లాక్‌లిస్ట్‌లో ఉంచాలని కోరారు. రైతు రుణాలు మాఫీ చేయాలని, అన్ని పంటలకు మద్దతు ధర ఇచ్చేలా చట్టం చేయాలని, పార్లమెంటులో విత్తన చట్టం తీసుకురావాలని తదితర డిమాండ్ల సాధన కోసం జనవరి 5న కర్నూలు ధర్నా చౌక్‌లో జరిగే మహా ధర్నాకు పెద్ద ఎత్తున రైతులు కదలి రావాలని విజ్ఞప్తి చేశారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ, సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు, టిడిపి రాష్ట్ర నాయకులు, ఇతర ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఎపి రైతు సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా సమితి కార్యదర్శి జనార్దన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న రంగారెడ్డి

పుస్తకాలతోనే జ్ఞానం : డిఇఒ రంగారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈ ఎలక్ట్రానిక్ యుగంలో పుస్తకాలను చదవడం ద్వారానే జ్ఞానం సంపాదించగలమని కర్నూలు డిఇఒ వి. రంగారెడ్డి తెలిపారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శనను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ.. మనిషికి కావాల్సిన జ్ఞానాన్ని అందించేవి గ్రంథాలయాలు, పుస్తకాల షాపులేనని తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధ మేధావులు, సామాజికవేత్తల జీవితచరిత్రలు అందుబాటులో ఉంచడం మంచి పరిణామమని కొనియాడారు. వందేళ్ల క్రితం రాసిన పుస్తకాలకు నేటికి ప్రాముఖ్యత ఉందని అన్నారు. వీటిని విద్యావంతులు ఉపయోగించుకోవాలని సూచించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జె.రఘుబాబు మాట్లాడుతూ.. నేటికీ పుస్తకాలకు ఆదరణ తగ్గలేదని, ఇందుకు హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో యువతను చూస్తే తెలుస్తుందని, ఇది మంచి పరిణామమని అన్నారు. ప్రజాశక్తి కర్నూలు మేనేజర్ నరసింహ మాట్లాడుతూ.. పుస్తకాలు చదివే వారే భవిష్యత్తు మార్గదర్శకులుగా ఉంటారని తెలిపారు. బుక్ హౌస్ ఇంచార్జి జి.మధు మాట్లాడుతూ.. జనవరి13 వరకు ఈ ప్రదర్శన ఉంటుందని, పుస్తక ప్రియులు ఉపయోగించుకోవాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజి బాబు, ఎల్లాగువేరా పాల్గొన్నారు.

కందుకూరు ఘటనపై జగన్ దుష్ప్రచారం

- మాజీమంత్రి నక్కా ఆనంద్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కందుకూరు దుర్ఘటనపై సిఎం వైఎస్ జగన్ దుష్ప్రచారం చేస్తూ వికృతానందం పొందుతున్నారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్ట్‌టైం పాదయాత్ర చేసిన జగన్‌కు చంద్రబాబు సభలకు వస్తున్న జనప్రభంజనం ఎలా కనిపిస్తుందని ప్రశ్నించారు.

టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ పైకి చెప్పుకోలేనంత తీవ్రమైన నిరాశా, నిస్పృహల్లో ఉన్నారని నర్సీపట్నం సభలో ప్రసంగాన్ని చూస్తే అర్థమవుతుందన్నారు. ప్రతిపక్ష నేత సభలకు ప్రభుత్వం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తే కందుకూరు ఘటన జరిగేదే కాదని విమర్శించారు. సభ వద్దకు వందమంది పోలీసుల్నే పంపారని, దుర్ఘటన జరిగాక మరో 200 మందిని పంపినట్టు ఉత్తుత్తిగా రికార్డుల్లో నమోదు చేశారని పేర్కొన్నారు. తన పాదయాత్రలో సంభవించిన మరణాలన్నీ జగన్ చేసిన హత్యలేనా అని ప్రశ్నించారు. కచ్చులూరు బోటు ప్రమాద మరణాలు, జంగారెడ్డి గూడెం కల్తీమద్యం మరణాలన్నీ వైసిపి ప్రభుత్వ హత్యలు కావా అని నిలదీశారు. దళిత ఎంపి చనిపోతే ఆయన కుటుంబాన్ని పరామర్శించడానికి కూడా వెళ్లలేదని అన్నారు.

'ఆ' నిధులు జమ చేయండి

- రాష్ట్రానికి కేంద్రం లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్ర పథకాలకోసం ఖర్చు చేయాల్సిన నిధులను తక్షణం సింగిల్ నోడల్ ఏజెన్సీ (ఎస్ఎన్ఎ) బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని కోరింది. ఈ మేరకు పిఎమ్ఎస్‌నుండి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ అందింది. కేంద్ర పథకాల కోసం వినియోగించాల్సిన 3,873 కోట్ల రూపాయలు ఇంకా రాష్ట్ర ఖజానాలోనే ఉన్నాయని ఈ లేఖలో పేర్కొన్నారు. వాటిని ఎస్ఎన్ఎలో జమచేయడం ద్వారా పథకాల అమలును కొనసాగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు,. ప్రతి యేటా రాష్ట్రంలో అమలు చేసే పలు కేంద్ర పథకాలకు కేంద్రం కొంత నిధులు ఇస్తుంది. దీనికి రాష్ట్రం కూడా తన వాటా నిధులను జత చేయాల్సి ఉంటుంది.

మొత్తం పథకాలకు వ్యయం చేయాల్సిన 3,973 కోట్లలో కేంద్రం నుంచి 1,860 కోట్లు రాగా, రాష్ట్రం తన వాటాగా 2,113 కోట్లు జత చేయాల్సి ఉంది. ఈ మొత్తాన్ని 21 రోజుల్లోగా ఎస్ఎన్ఏ ఖాతాకు జమ చేయాలని మార్గ దర్శకాలు ఉన్నాయి. అయితే ఇప్పటివరకు ఆర్థిక శాఖ ఈ మార్గదర్శకాలను పట్టించుకోలేదు.

దీంతో ఏయే పథకాలకోసం ఎంత మొత్తం రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎన్ఏలో జమచేయాలో పేర్కొంటూ కేంద్రం లేఖ రాసింది.

ముఖ్యమైన పథకాల నిధుల వివరాలు (రూ.కోట్లలో)

పథకం	కేంద్ర వాటా	రాష్ట్ర వాటా	మొత్తం
పట్టణ పిఎంఎవై	893	893	1786
సమగ్ర శిక్ష	304	578	882
పట్టణ పునరుద్ధీకరణ	198	213	411
స్వచ్ఛభారత్ మిషన్	117	154	271
హెల్త్ మిషన్	118	79	197
పట్టణాల పెట్టుబడులు	32	21	53
గ్రామీణ సడక్‌యోజన	96	64	160
పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్	35	45	80

జాతీయ బ్యాంకుల తరహాలో సహకార బ్యాంకుల ఉద్యోగులకూ వేతనాలు

- ఎపిఎస్ఎఫ్ఎల్ ఛైర్మన్ గౌతమ్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



జాతీయ బ్యాంకుల తరహాలో సహకార బ్యాంకుల ఉద్యోగుల వేతనాలు కూడా త్వరలో అందనున్నాయని ఎపిఎస్ఎఫ్ఎల్ ఛైర్మన్ పూనూరు గౌతంరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచిన విధంగానే సహకార వ్యవస్థలో పనిచేసే ఉద్యోగుల వయోపరిమితిని పెంచాలని కోరగా, సిఎం అంగీకరించారని తెలిపారు. విజయవాడ బందరు రోడ్డులోని కృష్ణా జిల్లా డిసిసిబి బ్యాంక్‌లో శనివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎపిసిబిఇఎ) 2023 నూతన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గౌతంరెడ్డి మాట్లాడారు. డిసిసిబి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 23.47 శాతం పిట్‌మెంట్‌తోపాటు తెలంగాణ డిసిసిబి ఉద్యోగుల కంటే ఎంతో మెరుగైన వేతన సవరణ సాధించామన్నారు. దశాబ్దంగా పెండింగ్‌లో ఉన్న పిఎసిఎస్ సర్వీస్ నుంచి 25 శాతం కోటా ద్వారా బ్యాంకు సర్వీసులోకి నియమించబడ్డ ఉద్యోగులకు వెయిటేజీ ఇంక్రిమెంట్ల సమస్యను పరిష్కరించగలిగామన్నారు. 25 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన సబ్‌స్టాఫ్‌కు స్పెషల్ అలవెన్స్ మంజూరు చేయించడంలో యూనియన్ కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, గుంటూరు డిసిసిబి అధ్యక్షులు తన్నీరు నాగేశ్వరరావు, రాతంశెట్టి సీతారామాంజనేయులు, అసోసియేషన్ ముఖ్య సలహాదారు బోగాది శ్యామ్ ప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షులు చల్ల త్రినాధ్‌రెడ్డి, అధ్యక్షులు తాతిపూడి వెంకట సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి కోనేరు బాలాజీ ప్రసాద్, కోశాధికారి ఇఎన్‌వి రమేష్ పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నూతన సంవత్సర కేక్ కట్ చేశారు.

వడ్డీతో సహా డిఎ బకాయిలు చెల్లించాలి

సిఎస్‌కు ఎపి సెక్రటేరియట్ సిపిఎస్ అసోసియేషన్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిఎ బకాయిలు వడ్డీతో సహా చెల్లించాలని, పెండింగ్ డిఎలు, పిఆర్‌సి బకాయిలు, పెన్షన్ ఫండ్‌కు సకాలంలో కంట్రిబ్యూషన్ చెల్లించాల్సిన ప్రభుత్వ వాటా 14 శాతం వెంటనే చెల్లించాలని ఎపి సెక్రటేరియట్ సిపిఎస్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డికి శనివారం అసోసియేషన్ నాయకులు లేఖ రాశారు. సిపిఎస్ ఉద్యోగుల జీతాల్లో 10 శాతం కట్ చేస్తున్న ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగుల ఖాతాలకు మార్చి 2022 నుంచి చెల్లించడం లేదని పేర్కొన్నారు. దీంతో, పెన్షన్ ఫండ్ గ్రోత్ దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పే స్లిప్పుల్లో మాత్రం సిపిఎస్ వాటాగా జిపిఎఫ్ పేరుతో కోత పడుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఆర్థికశాఖ ఇచ్చిన జిఒఎంఎస్ నెంబరు 21ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసి కొత్త జీఓ ఇచ్చిందని లేఖలో ప్రస్తావించారు.

'ఆ' ప్రశ్నలు ఎలా వచ్చాయి?

- ఇంటింటి సర్వేపై ఉన్నతాధికారుల ఆరా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అనేక ప్రాంతాల్లో మహిళా పోలీసులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే వివాదాస్పదమైన నేపథ్యంలో దానికి కారణమైన ప్రశ్నలపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఈ ప్రశ్నలను ఎవరు రూపొందించారు? ఏ స్థాయిలో సర్వేలో చోటుచేసుకున్నాయన్న అంశాలను సేకరిస్తున్నారు. ఉన్నతస్థాయి అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం అధికారులు ఆమోదించిన సర్వేలో 11 వ కాలమ్ లేదు. ఆ కాలమ్‌లోనే వివాహేతర సంబంధాలు, బహుళ వివాహాలకు సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి. రాష్ట్రమంతా ఈ కాలమ్ లేదని, కొన్ని ప్రాంతాల్లోనే కనిపిస్తోందని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యలో ఆ కాలమ్‌ను, అందులోని ప్రశ్నలను ఎవరు తయారు చేశారు? కొన్ని ప్రాంతాల్లోనే ఆ కాలమ్ ఎందుకు సర్వేలో చేరింది అన్న అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

గిరిజనుల అర్ధనగ్న నిరసన

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న ఉద్యమకారులతో సురేంద్ర

గిరిజన విద్యారంగంపై నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ గిరిజనులు వినూత్నంగా నిరసన తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ ఎదుట శనివారం ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన అర్ధనగ్నంగా నిరశన తెలిపారు. గిరిజన విద్యార్థుల వరుస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని, గిరిజన ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తూ, గిరిజన ప్రజాప్రతినిధులను హేళన చేస్తున్న పాడేరు ఐటిడిఎ పిఒను ప్రభుత్వం సరెండర్ చేయాలని, పెదబయలు తహశీల్దారు మృతిపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఐటిడిఎ కార్యాలయం ఎదుట గిరిజనులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 13వ రోజుకు చేరాయి. నిరసన కారులు గోచీలతో దీక్షా శిబిరంలో కూర్చు న్నారు. వారి పోరాటానికి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మద్దతు తెలిపి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణను ప్రభుత్వం సరెండర్ చేయకుండా ఆయన ప్రోత్సహించే విధంగా వ్యవహరించడం దారుణమన్నారు. గిరిజన విద్యార్థుల మరణాలు రోజురోజుకూ పెరుగుతున్నా అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దారుణమన్నారు. పెదబయలు మండల తహశీల్దార్ ఆత్మహత్యకు పిఒ వేధింపులే కారణమని ఆరోపణలు ఉన్నప్పటికీ ఆయన నుంచి ప్రభుత్వం వివరణ కోరలేదన్నారు. గిరిజన హక్కులు, చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిఒపై చర్యలు తీసుకోకుంటే మున్ముందు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రాధాకృష్ణ, కో - కన్వీనర్ కిల్లో ప్రభుదాస్, చిన్నారావు, ముమ్వల లక్ష్మణరావు, కాదేలి చంటిబాబు, బత్తిరి నరేష్, జీవన్ కృష్ణ, జాన్ వెస్లీ, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

రూ.2వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

- మూవర్స్.కామ్ సిఇఒ వెల్లడి



హైదరాబాద్ : వచ్చే నాలుగేళ్లలో రూ.2వేల కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మూవర్స్.కమ్ వ్యవస్థాపకులు, సిఇఒ విద్యాధర్ గారపాటి అన్నారు. రీలొకెటెడ్ (పునరావాస) పోర్టల్ మూవర్స్.కమ్‌ను నిర్వహిస్తున్న ఈ సంస్థ హైదరాబాద్‌లో 20వ వార్షికోత్సవాన్ని నిర్వహించుకుంది. ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ.. మూవర్స్.కమ్ లీడ్ అగ్రిగేటర్ నుంచి రీలొకేషన్ మేనేజ్‌మెంట్ కంపెనీగా మారడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. గత రెండు దశాబ్దాల్లో 35 లక్షల మంది వినియోగదారులకు సేవలందించామన్నారు. అపార్ట్‌మెంట్‌లోని ఒక గదిలో ప్రారంభమై తమ సంస్థ ఇప్పుడు 75 సిబ్బంది గల కంపెనీగా ఎదిగిందన్నారు. ఏడాదికి రూ.165 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేస్తుందన్నారు.

దేశంలోని ఇతర ప్రాంతాలకు తన కార్యకలాపాలను విస్తరించాలని కూడా యోచిస్తోందన్నారు. వద్ధికి చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. అదే విధంగా బీమా, గహ మెరుగుదల, గృహ భద్రత మొదలైన క్రాస్ సెల్లింగ్ సేవలలోకి ప్రవేశించడంపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు.

కెఎస్ఆర్‌టిసికి ఓలెక్ట్రా తొలి ఇవి బస్ డెలివరీ

50 వాహనాలను అందించనున్న కంపెనీ



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న కర్ణాటక మంత్రి శ్రీరాములు

హైదరాబాద్ : దక్షిణాదిలోనే తొలి ఇంటర్ సిటీ ఎలక్ట్రిక్ బస్సు శనివారం బెంగళూరులో ప్రారంభమైంది. 12 మీటర్ల ఓలెక్ట్రా ప్రీమియం లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసును కర్ణాటక రవాణా శాఖ మంత్రి బి శ్రీరాములు లాంచనంగా ప్రారంభించారు. ఎయిర్ కండిషన్డ్, ఓలెక్ట్రా ఇ-బస్ ప్రీమియం లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సు ఆవిష్కరణ కార్యక్రమంలో కెఎస్ఆర్‌టిసి ఛైర్మన్ ఎం చంద్రప్ప, ఎండి వి అన్బు కుమార్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓలెక్ట్రా సిఎండి కెవి ప్రదీప్ మాట్లాడుతూ.. "దేశంలో 2021లో ఇంటర్‌సిటీ ఎలక్ట్రిక్ లగ్జరీ కోచ్ బస్సులను ప్రవేశపెట్టిన మొదటి కంపెనీ తమదేనని అన్నారు. "మేక్ ఇన్ ఇండియా" ద్వారా, ఓలెక్ట్రా ఫేమ్ 2 పథకం కింద 50 ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేస్తుందని అన్నారు. ఈ ఇ-బస్సులు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ 7 డిపోల నుండి బయలుదేరుతాయి. ఇది ప్రజా రవాణాలో ఓలెక్ట్రా ప్రస్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. ట్రాఫిక్, ప్రయాణీకుల సంఖ్య ఆధారంగా ఇ-బస్సులు ఒకే ఛార్జ్‌పై 300 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయన్నారు.

విమానయాన రంగానికి కరోనా బెంబేలు

విస్తరణ ప్రణాళికలు రద్దు

న్యూఢిల్లీ : కరోనా కొత్త వేరియంట్‌ల భయాలు విమానయాన రంగ కంపెనీలను బెంబేతెత్తిస్తున్నాయి. కొత్త ఏడాది ఎలా ఉంటుందోననే ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో ఆ రంగంలోని కంపెనీలు కొత్త పెట్టుబడులు, విస్తరణపై ఆచీతూచి వ్యవహరిస్తున్నాయి. అంతర్జాతీయ ప్రయాణికులపై ఆంక్షలు మొదలవుతున్న నేపథ్యంలో ఆయా కంపెనీలు వ్యయాలపై ఆలోచనలో పడ్డాయని విమానయాన రంగ నిపుణులు పేర్కొంటున్నారు. కరోనా కాలంలో భారీ నష్టాలను ఎదుర్కొన్న కంపెనీలు గత ఎడెనిమిది నెలల నుంచి రాణిస్తున్నాయి. కాగా.. 2023 ఈ కంపెనీలాకు లాభదాయకంగా ఉండొచ్చనే విశ్వాసం ఉన్నప్పటికీ.. మరోవైపు భయాలు నెలకొన్నాయని ఏవియేషన్ నిపుణులు అమెయా జోషి పేర్కొన్నారు. 2021 చివరి మాసంలో అంతర్జాతీయ విమానాల రాకపోకలపై తీవ్ర ఆంక్షలు ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుత ప్రతికూల పరిస్థితులను కూడా డిజిసిఎ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ద్రవ్యలోటు లక్ష్యంలో 59 శాతానికి చేరిక

న్యూఢిల్లీ : దేశ ద్రవ్య లోటు పెరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యంలో నవంబర్ ముగింపు నాటికి 59 శాతానికి చేరింది. 2023 మార్చి ముగింపు నాటికి రూ.16.61 లక్షల కోట్లు ఉండాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. జిడిపిలో ఇది 6.4 శాతం. నవంబర్ ముగిసే నాటికి ఇది 9.78 లక్షల కోట్లకు చేరింది.

కోడి పందేలకు సై !

- పుంజులకు భారీగా పెరిగిన గిరాకీ
- బరుల ఏర్పాటుకు సిద్ధపడుతున్న నిర్వాహకులు !

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి


కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలో బరి కోసం సిద్ధం చేసిన స్థలం

సంక్రాంతి సమీపించడంతో జూదరులు కోడి పందేలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చి పందెం పుంజులను తయారు చేశారు. ఇలా సిద్ధమైన పుంజుల కోసం జూదరులు పోటీపడుతున్నారు. మరో పక్క పందేల నిర్వహణకు బరులను సిద్ధం చేసేందుకు నిర్వాహకులు అనువైన ప్రాంతాలను వెతుకుతున్నారు. కోడిపందేలతో పాటు పేకాట, గుండాట, ఇతర జూదాలకు తెరలేపేందుకు సన్నద్ధం అవుతున్నారు. వాటిని అడ్డుకుంటామని పోలీసులు ఒకవైపు హెచ్చరిస్తున్నా అనుమతుల కోసం నాయకులతో పైరవీలు ఇప్పటికే మొదలయ్యాయి.

రూ.600 కోట్లు పైనే...

సంక్రాంతి సమయంలో ఏటా రూ.600 కోట్ల వరకూ చేతులు మారుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాట్రేనికోన, ఐ.పోలవరం, అల్లవరం బరుల్లోనే రూ.300 కోట్లకు పైగా చేతులు మారుతుంటాయి. వీటితో పాటు రాజోలు, ముమ్మిడివరం, కొత్తపేట, అమలాపురం, రావులపాలెం, అంబాజీపేట, ఆత్రేయపురం మండలాలు, మెట్టప్రాంతంలో జగ్గంపేట, పిఠాపురం, గొల్లప్రోలు, కిర్లంపూడి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండాలాల్లో ఎక్కువగా కోడిపందేలను నిర్వహిస్తుంటారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో బరులను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఖాళీ ప్రాంతాలను సందర్శించారు. చిన్న, పెద్ద కలిపి మొత్తం 500 వరకూ బరులు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ప్రణాళికలు రూపొందించారు.

మొదలైన బేరసారాలు

సంక్రాంతి పేరుతో వారం రోజులు పాటు కోడిపందాలు ఆడుకోవడానికి ఇప్పటినుంచే ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీ నాయకులు బేరసారాలు మొదలుపెట్టారు. ప్రతి సంవత్సరం నిర్వహించే బరుల్లో యథేచ్ఛగా పందేలు నిర్వహించుకునేందుకు సిద్ధపడుతున్నారు. కోడి పందేలు జరిగినన్ని రోజులూ అటువైపు రాకుండా పోలీసులకు ముడుపులు అప్పజెప్పేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పందేల నిర్వాహకులు ఆయా ప్రాంతాన్ని బట్టి ఒక్కో బరికి రూ.2లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ అధికార పార్టీ నేతలకు ముట్టజెప్పేలా రేట్లు మాట్లాడుకుంటున్నారు. కాకినాడ జిల్లాలో హైవేను ఆనుకుని ఉన్న గండేపల్లి, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని, కాకినాడ రూరల్ తదితర ప్రాంతాల్లో ఈ సారి రేట్లు అధికంగా ఉండే అవకాశం కనిపిస్తోంది.

చర్యలు తప్పవంటున్న పోలీసులు

సంప్రదాయం పేరుతో జూదాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ఎం.రవీంద్రనాథ్‌బాబు ఇప్పటికే హెచ్చరించారు. కోడిపందేల అడ్డుకట్టుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన బరుల వద్ద ప్రత్యేకంగా నిఘా ఉంచామని చెబుతున్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలోనూ ఆయా సర్కిళ్ల పరిధిలో సంప్రదాయ సంక్రాంతి పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఆటోల ద్వారా వారు ప్రచారం చేస్తున్నారు.

ఐదు నెలల ముందు నుంచే శిక్షణ

సంక్రాంతి పండుగకు ఐదు నెలల ముందు నుంచే పందెం కోళ్లను సిద్ధం చేస్తారు. వివిధ రకాల జాతుల కోడిపుంజులను రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేస్తారు. పుంజుల సంరక్షణకు ప్రత్యేకంగా ముగ్గురిని ఏర్పాటు చేస్తారు. పందానికి తయారయ్యే పుంజులకు రూ.50 వేల నుంచి లక్ష రూపాయలకుపైనే ఖర్చు చేస్తారు. ఇలా సిద్ధమైన ఒక్కో పుంజు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. పందాలు వేసే కోడి పుంజుల్లో తెల్ల నెమలి, కోడి నెమలి, గౌడ నెమలి, కాకి డేగ, నెమలి కక్కెర, నల్ల కక్కెర, రసంగి, గాజు కక్కురాయి, అబ్రాస్, ఎర్రడేగ వంటి జాతులు ఉంటాయి. పందెపు కోళ్లను తయారు చేసే వారికి ప్యాకేజీల మాదిరిగా వేతనం ఇస్తారు. ఇది రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ ఉంటుంది.

సంపాదకీయం


టీచరమ్మలు!

సాధారణంగా సమాజంలో స్ఫూర్తి నింపిన వ్యక్తుల వైపు చూస్తాము. తద్వారా వారు సాధించిన ఘనతను స్ఫూర్తిగా తీసుకొని మనం కూడా ఏదైనా సాధించాలని ప్రతినబూనడం సహజం. సూపర్ మ్యాన్ నుంచి మహాత్మా గాంధీ వరకు అనేక స్ఫూర్తిదాయకమైన వాస్తవిక, కల్పిత వ్యక్తులను, పాత్రలను నమూనాగా తీసుకుంటారు. అబ్బాయిలు మగ పాత్రల వైపు మొగ్గు చూపినట్లుగానే, అమ్మాయిలు స్త్రీ పాత్రల వైపు మొగ్గు చూపుతారు. అయితే అంతరిక్షానికి ఎగసినా... అంతర్జాతీయ స్థాయికి ఎదిగినా వారి గుర్తింపు పురుషులతో పోల్చినప్పుడు స్వల్పమే. స్త్రీ పట్ల సమాజం, మన సంస్కృతి, కర్మ సిద్ధాంతాలు, అంతకంటే పురుషాధిపత్యం చూపిన వివక్షతను జాషువా స్పష్టాతి స్పష్టం చేసాడు. స్త్రీ కంటే పురుషుడధికుడని తాటాకుల్లో రాసి, కంఠమెత్తి ప్రచారం చేసారని, స్త్రీ జాతికే ఇది తీరని అన్యాయమని, స్త్రీకి పురుషునితో సమాన గౌరవం ప్రసాదించమని తన పద్యాలతో వేడుకుంటాడు జాషువా. అంతేకాదు...'అబలయన్న బిరుద మంటించి కాంతల/ స్వీయ శక్తులదిమి చిదిమినారు/ సబలయన్న బిరుదు సాధించి హక్కులు/ గడన చేసి కొమ్ము కష్ట చరిత' అంటూ తమ హక్కుల సాధన దిశగా మహిళా లోకాన్ని జాగృతం చేశాడు.

మహిళలు ఇల్లు దాటి బయటకు రావడం మహాపరాధంగా భావించే రోజుల్లో, వారి హక్కుల గురించి ఎవ్వరూ పట్టించుకోని సమయంలో మహిళా విద్య కోసం, సామాజిక రుగ్మతల నిర్మూలన కోసం... కులంపైన, పితృస్వామ్యంపైన కలంతో యుద్ధం చేసి, ఆధిపత్యాన్ని ధిక్కరించిన సంస్కర్త...తొలి కవయిత్రి, తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి ఫూలే. చదువు ఎవరి సొత్తు కాదు. సమాజంలో అందరూ సమానమే అంటూ బడుగు, బలహీన వర్గాలకు స్ఫూర్తినిచ్చి... నిర్బంధాన్ని, వివక్షను కడదాకా ఎదుర్కొన్న సావిత్రి బాయి పుట్టిన రోజైన జనవరి 3ను 'జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం' గా ప్రకటించారు. సమాజంలో మహిళా విద్య పట్ల వ్యతిరేకత ఉన్న కాలంలో అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు, సంపద వంటి సమస్త హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, మనువాద సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి, నేటి టీచరమ్మలకు ఆదిగురువయ్యారు ఆమె. 'అక్షరాలు దిద్దించే అమ్మేరా గురువంటే' అంటాడో కవి. అలాంటి గురువులు నేడు లక్షలాదిగా వున్నారు. ఒక్క ఎ.పి లోనే మూడు లక్షలకు పైగా వున్న టీచర్లలో 49 శాతం టీచర్లు మహిళలే. కొన్ని జిల్లాల్లో పురుషుల కంటే కూడా ఒకటి రెండు శాతం ఎక్కువే వున్నారు. అయినప్పటికీ... రాష్ట్రంలో బాలికా విద్య తక్కువే. అది ఎస్సీ, ఎస్టీల్లో ఇంకా తక్కువ.

టీచర్ ఉద్యోగంపై మమకారంతోనో, రిజర్వేషన్ల వల్లనో... ఏవైనప్పటికీ-పురుషులకు తీసిపోని విధంగా ఉద్యోగాలు పొందారు. అయితే... వీరికి ఉద్యోగంతో పాటు ఇంటి పని కూడా అదనపు భారంగా మారింది. ముఖ్యంగా భార్యాభర్తలిద్దరూ టీచర్లుగా వున్నప్పటికీ...గృహ నిర్వహణ, పిల్లల పని టీచరమ్మలకు అదనపు భారంగా మారుతోంది. చాలామంది భర్తలు పని భారం పంచుకోడానికి సిద్ధపడరు. పైగా కొందరు టీచరమ్మల జీతం, ఎటిఎం కార్డు సహా ఆయన జేబులోనే వుంటుంది. చివరకు ఆమె రోజువారీ ఖర్చులకు సైతం అయ్యవారిని అడిగి తీసుకోవాల్సిందే. 'మతం దృష్టిలో సమాజం అంటే పురుషులేనని, వారి అవసరాల కొరకు మాత్రమే స్త్రీ సృష్టించబడ్డదనే భావం ప్రబలంగా వుంది. అందుకే ఆడదానికి ఆజన్మాంతం సంరక్షకత్వం ప్రతిపాదించాడు మనువు' అంటారు మల్లాది సుబ్బమ్మ. 'మహిళల జీవన ప్రమాణాలే దేశాభ్యున్నతికి గీటురాయి' అంటారు నెహ్రూ. మహిళలకు విద్యా, ఉద్యోగంతో పాటు ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల్లో చేర్చినప్పుడే నిజమైన సాధికారత వచ్చినట్లు. కాలం ఎవరికోసం ఆగదు. అది నిత్య జీవన సమరం. ఈ సమరంలో కొన్నిటిని వదిలించుకోవాలి. కొన్నిటిని ఆచరణకు పూనుకోవాలి. ఆ పూనిక జీవితంలో నూతనోత్సాహం నింపుతుంది. టీచరమ్మల సాధికారతకు కొత్త శోభను అద్దుతుంది. ఈ కొత్త సంవత్సరం ఆ దిశగా ముందుకు సాగాలి. ఒక అభ్యుదయ సమాజ నిర్మాణంలో టీచరమ్మలకు చేయూతనివ్వాలి. అదే నిజమైన 'మహిళా టీచర్స్ డే'.

మంచి మాట




సమాజ పరివర్తనకు, దారిద్ర్య నిర్మూలనకు, ఆకలిని అంతం చేయడానికి విద్య ఒక విప్లవాత్మకమైన సాధనం. అదే విధంగా విద్య మనిషి వ్యక్తిత్వ వికాసం, వ్యక్తి సామర్థ్యాలను పెంచే సాధనం కావాలి.

- పాలో ఫ్రీరీ, అమెరికన్ విద్యావేత్త.

2023 స్వాగత గీతం.. చైతన్య ప్రభాతం...

ప్రస్తుతం



తెలకపల్లి రవి

కరిగిపోయిన కాలానికి వీడ్కోలు..అరుదెంచే రోజులకు ఆహ్వానం.. ఇదో నిరంతర ప్రక్రియ. ప్రవాహం. కాలం విసిరే సవాళ్లకు జవాబు కూడా కాలమే. కాలమంటే కార్యాచరణే. మన కార్యక్రమాలే. ఎవరు కదలినా లేకున్నా కాలం కదలిపోతుంటుంది. గతవారం ముగిసిన 2022ను సమీక్షించుకుంటే ఈ వారం రాబోయే 2023ను స్వాగతించాలి. ఎలా వుంటుందో అంచనా వేసి ఎలా వుండాలో నిర్వచించుకోవాలి. నిర్ణయించుకోవాలి. 'మంచి గతమున కొంచెమేనోయ్ మందగించక ముందుకడుగెయ్' అన్న గురజాడ మాటలైనా, 'పదండి ముందుకు' అని చెప్పే శ్రీశ్రీ కవిత్వమైనా సందేశమదే. మనుషులు ఎప్పుడూ గతం కన్నా భవిష్యత్తు బాగుండాలని ఆశిస్తారు. అందుకోసం యథాశక్తి అడుగులు వేస్తారు. ఆశ, ఆత్మవిశ్వాసం, ఆశయబద్ధమైన ఆచరణ ఇవే మానవాళిని ముందుకు నడుపుతాయి. అందుకే ప్రపంచమంతా 2023 ఆగమన వేడుకలు చూస్తాం. అయితే ఈ వేళలో మన దేశంలో మాత్రం మత చాందస సంస్థలు ఇది మనకు సంబంధం లేని వ్యవహారమని ప్రకటిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకలపై నిఘా వేస్తామంటున్నారు. 2022 ఏళ్లుగా సాగుతున్న వాటిని కాదని అంతకన్నా వెనక్కు వెళ్లాలనుకోవడం దేనికి సంకేతం? ఏవో సూక్తులు, సుభాషితాలు వల్లించి మారే కాలంతో మనకు సంబంధం లేదని చెప్పడం, రాతి యుగంలో పాతేయాల్సిన పాతకాలపు సరీసృపాలను నెత్తిన పెట్టుకోవడం దేశాన్ని ముందుకు నడిపించదు. ఇంకా ఇంకా ఇంకా వెనక్కు నెడుతుంది. ఇక్కడే మన కొత్త సంవత్సర కర్తవ్యాలు మొదలై పోయినట్టు చెప్పాలి. వాస్తవికతతో పొంతన లేని ఛాందసాలనూ ఒంటెత్తు పోకడలను వదిలించుకోవడం మొదటి కర్తవ్యం.

దేశమంతటా ప్రజా ఉద్యమాలపై రాష్ట్రాల హక్కులపై దాడి చేసే బిజెపిని పల్లెత్తుమాట అనకపోతే అది ఏ విధంగానూ పరిష్కారం కాదన్నది సత్యం. నిరంతర ప్రైవేటీకరణ, బడా సంపన్నులకు లక్షల కోట్ల రాయితీలు - బ్యాంకు సొమ్ముల ధారాదత్తం, ఆర్థిక అంతరాల తగ్గింపు లక్ష్యాన్ని వమ్ము చేస్తున్నాయి. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అణచివేతలు, దోపిడీ పీడనలపై జమిలిగా పోరాడాలి తప్ప పెద్ద పార్టీల ప్రచారాలు, నేతల కపట వాక్కులతో మోసపోకూడదు. ఇప్పటికే వెనకబడిన ఆర్థికాభివృద్ధి ఉత్పత్తి రంగం, పెరిగిపోయిన దిగుమతులు, కేంద్ర రాష్ట్రాల రుణ ఊబి గురించి జాగ్రత్త వహించాలి తప్ప మోడీ సర్కారు భజన కీర్తనల బుట్టలో పడకూడదు.



విశాల భారత వికాసం

మత ఛాందసం అన్నాక ఒకటే వుండదు. భారతదేశం భిన్న మతాలకు, విశ్వాసాలకు నిలయం. పల్లె పట్టుల నుంచి పాలనా వ్యవస్థ వరకూ కూడా మత సామరస్యం మన దేశానికి దిక్సూచిగా నిలిచింది. హిందూ ముస్లిం తేడా లేకుండా ఉమ్మడి వేడుకలు ఇక్కడ సామరస్యాన్ని, సహజీవనాన్ని చాటిచెప్పాయి. బ్రిటిష్ వారి పాలనకు ముందే ఇక్కడకు క్రైస్తవమూ ప్రవేశించింది. బౌద్ధం, జైనం, సిక్కు వంటివి అంతకు ముందే వున్నాయి. ఈ భిన్న మతాల నిలయంగా ఈ దేశ సంస్కృతిని, చరిత్రను అర్థం చేసుకోకపోతే ఈ దేశానికి భవిష్యత్తు వుండదు. మతాలు అనేకం వున్నాయి గనకనే రాజ్యాంగ నిర్మాతలు మతాతీతమైన లౌకికతత్వం ఎంచుకున్నారు. కులం, మతం, ప్రాంతం, స్త్రీపురుష తేడాలు వంటివి పాటించని లౌకికతత్వం ఎంచుకున్నారు. రాజ్యాంగం 14వ అధికరణం నుంచి 25 వరకూ ఈ సమానతా భావన మనకు గోచరిస్తుంది. ఏది ఎక్కువ ఏది తక్కువ అని గాక రాజ్యాంగం ప్రకారం నడుచుకోవడమే దేశానికీ మనుషులకూ శ్రేయస్కరం. స్వార్థ రాజకీయాల కోసం ఇంభుకు భిన్నమైన వాదనలు తెచ్చి అత్యధికంగా వున్న మతమే ఆధిక్యత వహించాలని అసహనానికి గురి కావడం అర్థరహితం. రాజకీయంగా ఇలాంటి సిద్ధాంతాలు ఎవరు చెప్పినా తోసిపుచ్చడం ప్రజాస్వామ్య స్పృహ గల ప్రతివారి బాధ్యత. తాత్కాలిక అవకాశవాదాలకు, ఆవేశకావేశాలకు గురై తమ మతాన్ని ఇతరుల మీద రుద్దాలని చూడటం ప్రజల మధ్య చిచ్చు పెడుతుంది. తెలియకుండానే నిన్నటి మిత్రుడు లేదా ఇరుగు పొరుగు కూడా విడిపోయే విషమ పరిస్థితి దాపురిస్తుంది. దానివల్ల ఎవరికీ శాంతిసౌఖ్యాలు లేకుండా పోతాయి. కనుక ప్రజల మధ్య ఐక్యతను సామరస్యాన్ని కాపాడుకోవడం కీలకం. ఇటీవలి అనుభవాలు ముఖ్యంగా గత ఏడాది చేసిన కొన్ని ఘటనలు చెబుతున్నదదే. చాప కింద నీరులా చొరబడిన మతతత్వ రాజకీయాలను తోసిపుచ్చాల్సి వుంటుంది. ఏ ఆధారం లేని కట్టుకథలు, విద్వేష వివాదాలకు మనం లోబడిపోకుండా జాగ్రత్త వహించాలి.

వాళ్ల చుట్టే తిరగొద్దు

రాజకీయ రంగంలో ఏవో కొన్ని పాలక వర్గ పార్టీలు (బిజెపి, కాంగ్రెస్, వైసిపీ, తెలుగుదేశం, బిఆర్ఎస్ వంటివి) మాత్రమే శరణ్యమన్న భావన పోవాలి. పౌరులెవరైనా తమకూ దేశాన్ని మలచే హక్కు వుంటుందని గుర్తించాలి. రాష్ట్రాలలో గాని కేంద్రంలో గాని ఒకరిద్దరు నాయకులు, ఒకటి రెండు పార్టీలు, కొన్ని కులాల చుట్టూనే తిప్పుతూ అసలు సమస్యలు పక్కదోవ పట్టించే కుట్రలను అర్థం చేసుకోవాలి. బడా పార్టీల ఆధ్వర్యంలోని మీడియా సోషల్ మీడియా సంస్థలు పథకం ప్రకారం గుడుగుడు గుంచంలా అవే కథనాల చుట్టూ పరిభ్రమణం చేయిస్తున్నారనేది ప్రజలకు తెలియజెప్పాలి. రైతాంగం కార్మికులు ఉద్యోగులు మహిళలు సామాజికంగా దళితులు వెనకబడినవారిని తమ వలయంలో బందీలను చేయడం తప్ప సమగ్రంగా ఆలోచించే అవకాశం లేకుండా చేయడాన్ని ఛేదించాలి. వృథా వివాదాలు, బూతు పురాణాలు, కులాల కుంపట్లు రగిలించే రాజకీయాలను నిరసించాలి. సామాజిక న్యాయం, సాధికారతతో పాటు మౌలిక సమస్యలపై సమిష్టిగా పోరాడకుండా ఒరిగేది వుండబోదని తెలియజెప్పాలి.

సంక్షేమ పథకాలు స్వాగతించినా సమూలమైన పరిష్కారం భూమి, ఉపాధి, జీవిత భద్రత, హక్కుల రక్షణతోనే ముడిపడి వుంటుందని గుర్తించాలి. కులమత విభేదాలు ఏ పరిష్కారం సూచించలేవని స్పష్టంగా తెలుసుకోవాలి. గొప్పలెన్ని చెప్పుకున్నా పాలక వర్గ పార్టీలు, నాయకులు అంతిమంగా అధికారం కోసం అర్రులు చాచేవారే. మౌలిక సమస్యలపై వారు ఎలాంటి నిర్దిష్ట ప్రతిపాదనలు చేయడం లేదనే వాస్తవాన్ని తెలుసుకోవాలి. సంక్షేమ పథకాలను అవహేళన చేయడం సరికానట్టే వాటిని ఏ ఒక్కరి దయాభిక్ష గానో వ్యక్తిగత ఉదారతగానో చిత్రించే ప్రయత్నాలనూ తోసిపుచ్చాలి. కేంద్ర రాష్ట్రాల పథకాలేవైనా అన్నీ ప్రజాధనంతో జరిగేవి ఈ పథకాలను ఇష్టానుసారం కుదించడం, కోతలకూ వడపోతలకూ గురిచేయడం నిలదీయాలి. పాలక పార్టీలన్నీ బిజెపి, వైసీపీ, బిఆర్ఎస్, టిడిపి, కాంగ్రెస్ వంటి పార్టీలతో సహా అధికారంలో వున్నప్పుడు, లేనప్పుడు రెండు రకాలుగా మాట్లాడే ద్వంద్వనీతిని దుయ్యబట్టాలి. ఇటీవల ఎ.పి ప్రజాస్వామ్య పునరుద్ధరణ సభలో సిపిఎం కార్యదర్శి శ్రీనివాసరావు చెప్పినట్టు హక్కుల హరింపు విషయంలో టిడిపి పాలనా కాలం దృష్టిలో పెట్టుకుంటే భవిష్యత్తులో తాము ఏ విధంగా వాటిని కాపాడేందుకు కట్టుబడి వుంటారో స్పష్టం చేయాలి. తెలంగాణ లోనూ బిజెపిపై పోరాటంలో బిఆర్ఎస్‌తో కలసి వ్యవహరించినా ప్రజల సమస్యలపై రాజీ వుండబోదని సిపిఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పిందీ అదే. దేశమంతటా ప్రజా ఉద్యమాలపై రాష్ట్రాల హక్కులపై దాడి చేసే బిజెపిని పల్లెత్తుమాట అనకపోతే అది ఏ విధంగానూ పరిష్కారం కాదన్నది సత్యం. నిరంతర ప్రైవేటీకరణ, బడా సంపన్నులకు లక్షల కోట్ల రాయితీలు-బ్యాంకు సొమ్ముల ధారాదత్తం, ఆర్థిక అంతరాల తగ్గింపు లక్ష్యాన్ని వమ్ము చేస్తున్నాయి. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అణచివేతలు, దోపిడీ పీడనలపై జమిలిగా పోరాడాలి తప్ప పెద్ద పార్టీల ప్రచారాలు, నేతల కపట వాక్కులతో మోసపోకూడదు. మేడిపండు లాంటి గ్లోబల్ మార్కెట్ బుడగలు వరుసగా పగిలిపోతుంటే వాటిపై శ్రుతిమించిన ఆశలు పెంచుకోవడం అర్థరహితమని గ్రహించాలి. అమెరికా ఉపగ్రహం కావడం కాదు, స్వావలంబన తప్ప దేశానికి మరో ప్రత్యామ్నాయం వుండదనే మెళకువ వుండాలి. తక్షణ సమస్యగా సవాలు విసురుతున్న కోవిడ్ వేరియంట్‌లు, ఐ.టి కుదుపులను తట్టుకోగల వ్యూహం కావాలి. ఇప్పటికే వెనకబడిన ఆర్థికాభివృద్ధి ఉత్పత్తి రంగం, పెరిగిపోయిన దిగుమతులు, కేంద్ర రాష్ట్రాల రుణ ఊబి గురించి జాగ్రత్త వహించాలి తప్ప మోడీ సర్కారు భజన కీర్తనల బుట్టలో పడకూడదు.

దేశమంటే మనుషులోయ్!

సాంకేతిక మార్పుల యాజమాన్య పద్ధతుల మార్పులు, ప్రభుత్వ ప్రైవేటు నిఘాలలో చిక్కిన వ్యక్తిగత గోప్యత, స్వేచ్ఛ, నిర్వహణా స్వేచ్ఛ వంటివి కాపాడుకోవడం ఇక ప్రతివారికి పెద్ద అగ్నిపరీక్ష కాబోతున్నది. భావ ప్రకటనా స్వేచ్ఛ అనేది రాజకీయ సామాజిక కార్యకర్తలకో మీడియా వారికో మాత్రమే గాక గొప్ప రచయితలు కళాకారులకు కూడా మృగ్యమైపోతున్నది. ఇంకా విడుదల కాని 'పఠాన్' సినిమాలో నాయిక బికినీ ఏ రంగులో వున్నదనేదాన్ని బట్టి ముందస్తుగా నిషేధించడం గడచిన ఏడాది చివర పాదంలో చూసిన విపరీతం. ఇందుకు తలవంచడం మొదలెడితే ఇంకా ఇంకా అణచివేత తప్పదు. కనుకనే అన్ని తరగతుల ప్రజలూ అన్ని స్రవంతుల సంఘాలూ సృజనకారులూ కూడా తమ హక్కులను తామే రక్షించుకోవడానికి సిద్ధం కావలసిందే. విద్యార్థులు విద్యా హక్కు కోసం అధ్యాపకులు బోధనా హక్కు కోసం కూడా ఉద్యమించవలసిందే. ఉద్యోగ భద్రతకు ఘోరంగా కోతవేసి చాకిరీ పెంచే కొత్త కోడ్‌లపై వేతన జీవులు, కార్మికులు ఎలుగెత్తవలసిందే. వీటికి సమర్థనగా తెలివైన వాదనలు తెచ్చే పరాన్నభుక్కు మేధావుల ప్రచారాలనూ తిప్పికొట్టవలసిందే. అభ్యుదయం, ప్రజాస్వామ్యం లౌకికతత్వం, సామ్యవాదం, శ్రామిక చైతన్యం వంటి మహత్తర ఆశయాలను అవహేళన చేస్తూ ఆలోచనా పరులను నిరుత్సాహ పరిచేందుకూ ప్రజలను తమ చుట్టూనే తిప్పుకోవడానికి పాలక వర్గాలు పొంచి కూచుని వుంటాయని గుర్తిస్తే ఇందులో ప్రతి అంశం ఎంత ముఖ్యమైందో బోధపడుతుంది. సరైన ప్రారంభమే సగం విజయం. 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' అన్నట్టే ఏడాది మొదట్లోనే సరైన దిశా నిర్దేశం చేసుకోగలిగితే దేశాన్ని, సమాజాన్ని సంరక్షించుకోగల సత్తా సంతరించుకోగలం.

★

రూపాయి పతనం మోడీ 'ప్రతిభే'

విశ్లేషణ



"మోడీ ప్రభావం: 2014లో ఆసియా-పసిఫిక్ కరెన్సీలో ఉత్తమ ప్రతిభ చూపుతున్న రూపాయి". 2014 మే 25వ తేదీన టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక ఒక విశ్లేషణకు పెట్టిన శీర్షిక ఇది. అదే పత్రిక 2022 డిసెంబరు 30వ తేదీన "2022లో ఆసియన్ కరెన్సీలో చెత్త ప్రదర్శనతో ముగిసిన రూపాయి" అనే శీర్షికతో వార్తను ఇచ్చింది. 2014 కంటే మరింత బలంతో రెండవసారి అధికారానికి వచ్చిన తరువాత అదే నరేంద్ర మోడీ ప్రభావం పెరిగింది తప్ప తగ్గలేదని చెబుతున్నారు. నాడు వార్త రాసినపుడు డాలరుకు రూపాయి మారకం రేటు రూ.58.52 కాగా 2022 డిసెంబరు 30న ముగిసిన రేటు రూ.82.72. ఎంత పతనం?

2014 జనవరి ప్రారంభంలో రూ.61.80గా ఉన్న రూపాయి విలువ కొత్త ప్రభుత్వం వస్తుందన్న ఉల్లాసం, విదేశాల నుంచి డాలర్ల ప్రవాహంతో ఆరు నెలల్లో 58.52కు పెరిగింది, 328 పైసలు లాభపడింది. అలాంటి ఉల్లాసానికి కారకుడైన నరేంద్ర మోడీ ఏలుబడిలో ఇప్పటికి 2,420 పైసల నీరసం మిగిలింది. గతేడాది చివరిలో రూ.74.33గా ఉన్నది కాస్తా పన్నెండు నెలల్లో రూ.82.72కు అంటే 839 పైసలు దిగజారింది. ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు, చైనాను కట్టడి చేసేందుకు, ఇతర అంతర్జాతీయ అంశాల మీద నరేంద్ర మోడీ కేంద్రీకరించి రూపాయి పాపాయి సంరక్షణను నిర్మలా సీతారామన్‌కు అప్పగించారు. అదే మోడీ కేంద్రీకరించి ఉంటేనా అని భజనపరులు ఎవరైనా అనవచ్చు. నిజమే అనుకుందాం కాసేపు, మోడీ చూపు ప్రపంచం మీద పెట్టినప్పటికీ ఏ ఒక్క అంతర్జాతీయ సమస్యా పరిష్కారం కాలేదు. మనకు మాత్రం రూపాయి పతనంతో దిగుమతులు భారమై కష్టాలు పెరిగాయి. పోనీ వాటికి విరుగుడుగా తన పలుకుబడితో ఎగుమతులు పెంచారా అంటే అదీ లేదు.

మన్మోహన్ సింగ్ పాలనలో 2013లో మన కరెన్సీ విలువ దారుణంగా పతనమైంది. ఆ తరువాత 2022లో 11.3 శాతం పతనంతో నరేంద్ర మోడీ తనదైన రికార్డు నెలకొల్పారు. వచ్చే ఏడాది కొంత మేర విలువ పెరగవచ్చునే ఆశాభావంతో పాటు ఇంకా పతనం కావచ్చునే హెచ్చరికలూ వెలువడుతున్నాయి. జనవరి-మార్చి నెలల్లో రూ.81.50 నుంచి 83.50 మధ్య రూపాయి విలువ ఉండవచ్చని కొందరి అంచనా. తీవ్రమైన అనిశ్చితి. ధనిక దేశాల్లో మాంద్య తీవ్రత ఎలా ఉంటుంది, ఎంత కాలం కొనసాగుతుంది అన్నది ఎవరికీ అంతుబట్టటం లేదు. ఇప్పటికే మన ఎగుమతులు అధోముఖంగా ఉన్నాయి.

నరేంద్ర మోడీ పాలన పదవ ఏటలో ప్రవేశించే ముందు రూపాయి పతనంలోనే కాదు, ఇంకా అనేక రికార్డులు నెలకొల్పుతున్నారు. 2022-23వ సంవత్సరం రెండవ త్రైమాస కాలం (జులై-సెప్టెంబరు)లో దిగుమతులు-ఎగుమతుల్లో (దీన్ని కరంట్ ఖాతా అంటారు) 36.4 బిలియన్ డాలర్లు లోటు ఉంది. ఇది జిడిపిలో 4.4 శాతానికి సమానం. గతేడాది ఇదే కాలంలో ఉన్న లోటు 9.7 బి.డాలర్లు మాత్రమే. మన దేశం నుంచి వస్తువులతో పాటు సేవల ఎగుమతులు కూడా ఉన్నాయి. వస్తు లావాదేవీల లోటు గతేడాది 44.5 బి.డాలర్లు కాగా ఈ ఏడాది 83.5 బి.డాలర్లకు పెరిగింది. వస్తు సేవలకు సంబంధించి మిగులు 25.6 నుంచి 34.4బి.డాలర్లకు పెరిగింది.ఇది కాస్త ఊరట కలిగిస్తోంది. 2012లో అక్టోబరు-డిసెంబరు మాసాల్లో వాణిజ్యలోటు 32.6 బి.డాలర్లు ఒక రికార్డు కాగా నరేంద్రమోడీ దాన్ని బద్దలు కొట్టారు. ఈ ఏడాది అక్టోబరు-డిసెంబరు వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. సెప్టెంబరు తరువాత పరిస్థితి దిగజారింది తప్ప మెరుగుపడింది లేదు.

డిసెంబరు 15న కేంద్ర ప్రభుత్వం వర్తమాన ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి నవంబరు వరకు ఎగుమతి-దిగుమతి లావాదేవీల వివరాలను వెల్లడించింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది మన ఎగుమతులు 424.45 నుంచి 499.67 బి.డాలర్లకు (17.72 శాతం) పెరగ్గా దిగుమతులు 471.68 నుంచి 610.7 బి.డాలర్లకు (29.47 శాతం) పెరిగాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో తొలి ఎనిమిది నెలల్లో మన వాణిజ్య లోటు అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే 47.23 నుంచి 111.02 బి.డాలర్లకు పెరిగింది. 2022 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వాణిజ్యలోటు అంతకు ముందు ఏడాదితో పోల్చితే 102.63 బి.డాలర్ల నుంచి 192.41 బి.డాలర్లకు పెరిగింది. ఈ లెక్కన 2023 మార్చితో ముగిసే సంవత్సరంలో ఎంతకు చేరుతుందో చూడాల్సి ఉంది.

ప్రకటిత లక్ష్యం కనుచూపు మేరలో కనిపించకున్నా ఇంకా మన నేతలు 2025 నాటికి దేశ జిడిపిని ఐదు లక్షల కోట్ల డాలర్లకు పెంచుతామని చెబుతూనే ఉన్నారు. శుక్రవారం నాడు విదేశాంగ మంత్రి జై శంకర్ సైప్రస్‌లో మాట్లాడుతూ ఇదే చెప్పారు. 2025 మార్చి నాటికి ఐదు లక్షల కోట్ల డాలర్లకు, 2033-34 నాటికి పది లక్షల కోట్ల డాలర్ల సాధిస్తామని 2019లో ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. ప్రస్తుత అంచనా 2022 ప్రకారం 3.3 లక్షల కోట్ల డాలర్లు. కరోనా తదితర కారణాలను చూపుతూ 2025 గడువును 2027కు పెంచినట్లు కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ చెప్పారు. వచ్చే ఐదు సంవత్సరాల పాటు సగటున ఏటా తొమ్మిది శాతం వృద్ధి సాధిస్తే 2028-29నాటికి ఐదు లక్షల కోట్ల డాలర్లను సాధించగలమని రిజర్వుబాంకు మాజీ గవర్నర్ డి.సుబ్బారావు 2022 ఆగస్టులో చెప్పారు. ఇలా ఎవరి లెక్కలు వారు వేసుకుంటూ తమ సంపదల మాదిరి దేశ జిడిపి కూడా పెరుగుతుందని జనాన్ని నమ్మమంటున్నారు. ప్రపంచ జిడిపిలో మొత్తం సంపదలో చూస్తే అగ్ర స్థానంలో ఉన్న అమెరికా తలసరి జిడిపిలో ఏడవ స్థానంలో ఉంది. రెండవదిగా ఉన్న చైనా 77వ స్థానం, ఐదవదిగా ఉన్న మన దేశం 128వదిగా ఉంది. మన దేశం అమెరికా, చైనాలను దాటి వృద్ధి సాధించేందుకు పోటీ పడాలని ఎవరైనా కోరుకోవటం తప్పు కాదు. మన దేశ పరిస్థితి ఒక్కసారి ఊహించుకుంటే మనం ఎక్కడ ఉన్నాం, ఎంత ఎదగాలి?

- ఎం.కె.ఆర్

నిరంతరం కార్మికులు, ఉద్యోగుల వెన్నంటే...

సమరం



ఎ.వి. నాగేశ్వరరావు

దేశంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు కార్మిక వర్గం పట్ల అనుసరిస్తున్న విధానాల కారణంగా సంఘటిత, అసంఘటిత కార్మికుల జీవన పరిస్థితులు దారుణంగా దిగజారాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగటంలేదు. కార్మికులు, సాధారణ ప్రజానీకం జీవన పరిస్థితులపైనేకాక, వారి హక్కుల పైన దాడి చేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా...సామాన్య ప్రజల, కార్మికుల హక్కులు కాపాడడం కోసం, ఉద్యోగ భద్రత నిలబెట్టటం కోసం సిఐటియు నిరంతర పోరు సాగిస్తున్నది.

సంఘటిత రంగానికి చెందిన కార్మికులు, ఉద్యోగుల సమస్యలపైనే కాక సిఐటియు కోట్లాదిగా ఉన్న అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై రాజీ లేని పోరాటాలను నిర్వహించింది. దాదాపు 4 లక్షల మంది ఉన్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వెలుగు విఓఎ, సమగ్రశిక్ష, జాతీయ ఆరోగ్య మిషన్, ఉపాధి హామీ తదితర అన్ని ప్రభుత్వ పథకాలలోని కార్మికుల సమస్యలపై, ఉపాధి భద్రత కొనసాగింపుపై ఆందోళన నిర్వహించింది. వీరేకాక కోటికి పైగా ఉన్న భవన నిర్మాణం, హమాలీ, ఆటో, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు, బీడీ, సెక్యూరిటీ గార్డులు, క్వారీ, గనులు, ఆక్వా, జీడిపిక్కలు తదితర కార్మికుల పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో 3 లక్షల మందిగానున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, వర్క్ ఔట్‌సోర్సింగ్ తదితర ఉద్యోగుల ఆందోళనలకు బాసటగా నిలిచింది.

అంతేకాక కోవిడ్ కాలంలో కోట్లాది మంది వలస కార్మికులు దిక్కుతోచని స్థితిలో కాలినడకన స్వరాష్ట్రాలకు వెళుతున్న సమయంలో వారికి అనేక చోట్ల ఆహారాన్ని అందించింది. కరోనా వలన ఉపాధి కోల్పోయిన 1,60,649 కార్మికులకు దాతల సహాయంతో వస్తు, నగదు రూపేణ మొత్తం 3 కోట్ల రూపాయల విలువైన సహాయాన్ని మన రాష్ట్రంలో సిఐటియు ఎ.పి కమిటీ అందించింది. ఢిల్లీ రైతాంగ పోరాటానికి మద్దతుగా నిలిచింది. రాష్ట్రంలో ఆందోళనలు నిర్వహించింది. ఢిల్లీ రైతుల పోరాటానికి 21 లక్షల రూపాయల నగదు సహాయాన్ని సిఐటియు, సిఐటియు అనుబంధ సంఘాల ద్వారా వసూలు చేసి అందించింది. వివిధ పారిశ్రామిక ప్రమాదాలలో కార్మికులు మరణించినప్పుడు వారి కుటుంబాలకు న్యాయమైన పరిహారం చెల్లించేలా, న్యాయం జరిగేలా కృషి చేసింది. బిజెపి మతోన్మాద దాడుల బాధితులను ఆదుకోవటానికి, పాలస్తీనా ప్రజలకు సంఘీభావ నిధిని అందించే కృషి చేసింది.

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే అనేక జిల్లాల్లో అంగన్‌వాడీలు, ఆశాలు, విఓఏ లపై రాజకీయ వేధింపులు పెరిగాయి. అక్రమ తొలగింపులు జరిగాయి. దీనిని నిరసిస్తూ నిర్బంధాన్ని ఎదుర్కొని కూడా పెద్ద ఎత్తున నిర్వహించిన ఆందోళనల వలన...అక్రమంగా తొలగించిన వారిని విధుల్లోకి తీసుకున్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు నష్టం కలిగించేలా ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా వేలాది మందితో ధర్నా, లబ్ధిదారులతో కలిసి నిరసనలను సిఐటియు నిర్వహించింది. కరోనా వ్యాక్సిన్ వికటించి మరణించిన ఆశా కార్యకర్తకు నష్ట పరిహారం చెల్లించాలని రాష్ట్ర వ్యాప్త నిరసనలు నిర్వహించడంతో ప్రభుత్వం రూ.50 లక్షలు చెల్లించింది.



మధ్యాహ్న భోజన కార్మికుల ఉపాధికి ఎసరు పెట్టేలా ఈ పథకాన్ని అక్షయ పాత్ర సంస్థకు ఇవ్వాలనే నిర్ణయంపై పెద్ద ఎత్తున నిర్బంధాన్ని ఎదుర్కొని ఆందోళనలు నిర్వహించడంతో ప్రభుత్వం వర్కర్లను గ్రామాల్లో తొలగించబోమని ప్రకటించక తప్పలేదు. విఓఎ లు తమ ఉపాధి కొనసాగించాలని, 45 సంవత్సరాలకే రిటైర్ చెయ్యాలనే కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చెయ్యాలని వేలాదిగా 'చలో విజయవాడ' నిర్వహించారు. ప్రభుత్వం దాదాపు 5 వేల మందిని గృహ నిరంధం చేసినా, పోలీస్ స్టేషన్లో పెట్టినా కార్మికులు పెద్ద ఎత్తున పోరాడారు. ఉపాధి నిలబెట్టుకున్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు వేతన పెంపు, విలీనం కోసం మిలిటెంట్ గా ఆందోళనలు నిర్వహించారు. గోపాల మిత్రలు 34 రోజుల సమ్మెతో తమ కొనసాగింపును సాధించుకున్నారు. 104 ఉద్యోగుల కొనసాగింపు, వేతన పెంపు, 108 ఉద్యోగుల వేతన పెంపు, కోవిడ్ మృతులకు నష్ట పరిహారం చెల్లించడం, రిమ్స్ కార్మికులు, మున్సిపల్ కార్మికుల సమస్యలపైన, వేతన పెంపు మరియు డి.ఎ రికవరీపై విఆర్‌ఎల పోరాటాలన్నింటిలో సిఐటియు కార్మికులకు బాసటగా నిలిచింది. ఇసుక క్వారీల మూసివేతకు, నష్టదాయకమైన ఇసుక పాలసీకి వ్యతిరేకంగాను, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాలని భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగించారు. లారీలు, ఆటోలు తదితర ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్మికులు తమకు నష్టదాయకమైన మోటార్ వెహికల్ యాక్ట్ సవరణకు వ్యతిరేకంగా జిల్లా రాష్ట్ర స్థాయిలలో ధర్నాలు నిర్వహించారు. ఈ పోరాటాలన్నీ సిఐటియు ఆధ్వర్యంలో జరిగినవే.

పోరాటాలు జరగనివ్వకుండా వైసిపి ప్రభుత్వం జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. కార్మికులు సామూహికంగా చేసే ఆందోళనలను అణిచివేయటమే ధ్యేయంగా వ్యవహరిస్తున్నది. అనుమతులు ఇవ్వలేదనే సాకుతో దౌర్జన్యంగా అరెస్టులు చెయ్యడం, మహిళలని కూడా చూడకుండా అర్ధరాత్రులు స్టేషన్లలో కూర్చోబెట్టడం, రైళ్ళ నుంచి దింపడం వంటి దుర్మార్గపు పద్ధతులను అవలంభించింది. అయినా స్కీం వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులు, పెద్ద ఎత్తున పోరాటాలలో భాగస్వాములయ్యారు. కార్మికులే కాక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిపిఎస్ ఉద్యోగులు కూడా ఈ నిర్బంధానికి గురౌతున్నారు. ఇటువంటి నిర్బంధాల మధ్య జరిగిన పోరాటాలన్నింటిలో సిఐటియు ముందు పీఠిన నిలిచింది. కార్మిక వర్గ ఐక్యతతో ముందుకు సాగుతున్నది.

/వ్యాసకర్త: సి.ఐ.టి.యు రాష్ట్ర కోశాధికారి, సెల్ : 9490098031/

రెట్టింపు ఆదాయమేది మోడీజీ!

- అన్నదాతలకు మాట తప్పిన బిజెపి సర్కార్
- 2022 నాటికి రైతుల డబుల్ చేస్తామంటూ గతంలో గొప్పలు
- వాస్తవానికి రైతుల ఆదాయంలో భారీ క్షీణత
- రుణ భారాలతో అన్నదాత విలవిల
- ఐదేళ్లలో 28,572 మంది బలవన్మరణం



మోడీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'2022 నాటికి దేశంలోని అన్నదాతల ఆదాయం రెట్టింపు చేస్తాం. అదే ప్రభుత్వం లక్ష్యం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2022 నాటికి 75 ఏళ్లు పూర్తి అవుతుంది. అందుకనే 2022 నాటికి రైతులు ఆదాయం కూడా రెట్టింపు అవ్వాలి. అందుకనుగుణంగా మా ప్రభుత్వం పని చేస్తుంది"

- 2016 ఫిబ్రవరి 28న ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో జరిగిన రైతు ర్యాలీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన హామీ ఇది.

రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామనే లక్ష్యం స్వాగతించదగినదే. కానీ అంతటి చిత్తశుద్ధి పాలకులకు ఉండాలి కదా. మోడీ సర్కార్‌కు ఈ చిత్తశుద్దే లోపించింది. అన్నదాతల పట్ల బిజెపి ప్రభుత్వం ఎంతటి నిర్లక్ష్యంగా ఉందంటే కనీసం 'రైతు' అంటే ఎవరు? రైతు ఆదాయం అంటే ఏమిటి? అనే నిర్వచనం కూడా ఇవ్వలేనంత. రైతుల ఆదాయం డబుల్ చేస్తామంటూ మోడీ సర్కార్ లక్ష్యంగా నిర్దేశించుకున్న 2022 సంవత్సరం రానూవచ్చింది..ఆగస్టు 15న అమృత మహోత్సవాలు కూడా ఆడంబరంగా నిర్వహించడమూ సరేసరి..నిన్నటి శనివారంతో ఏడాది ముగియనూ ముగిసింది. కానీ మోడీ సర్కార్ అన్నదాతలకు వాగ్దానం చేసిన ఆదాయం మాత్రం రెట్టింపుకాలేదు. పైగా రైతన్నల ఆదాయం గతం కంటే భారీగా క్షీణించింది. రైతులు కన్నీళ్లు తడారలేదు. పండిన పంటకు కనీస మద్దతు ధర లేకపోవడం, మరోవైపు పంట పండించడానికి పెట్టుబడి వ్యయం యేటికేడూ పెరిగిపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల అప్పుల భారం పెరుగుతోంది. జూలై 2018 - జూన్ 2019 ఏడాదిలో దేశంలో సగటున ఒక్కో కుటుంబంపై రూ.74,121 రుణభారం ఉందని కేంద్ర ప్రభుత్వమే తెలిపింది. తాజా గణాంకాలను వెల్లడించేందుకు కూడా మోడీ సర్కార్‌కు మనసు రావడం లేదు. మరోవైపు రైతన్నల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయి. ప్రధాని మోడీ రైతులకు రెట్టింపు ఆదాయం చేస్తామని ప్రకటించిన తరువాత కాలంలో దేశవ్యాప్తంగా 28,572 (2017-22) మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.

పిఎం కిసాన్ లబ్దిదారుల కుదింపు

రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సహాయంలో భారీ కోత విధించింది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎంకిసాన్) పథకం నుంచి ఈ ఏడాదిలోనే కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే దాదాపు రెండు కోట్ల మంది రైతులను తొలగించారు. 2022-2023లో 11వ విడుత (ఏప్రిల్-జూలై)లో 10,45,59,905 మంది రైతులకు పిఎంకిసాన్ పథకం వర్తిస్తే, 12వ విడుత (ఆగస్టు-నవంబర్)లో 8,42,14,408 మంది రైతులకు మాత్రమే పిఎం కిసాన్ వర్తించింది. 2,03,45,497 మంది రైతులు పిఎం కిసాన్ పథకం నుంచి తొలగించారు. రెండు కోట్ల మంది రైతులను తొలగించడంతో కేంద్ర ప్రభుత్వం రూ.5,108 కోట్లను మిగిలించుకుంది. 11వ విడుతలో రూ.22,551 కోట్లు విడుదల చేస్తే, 12 విడుతలో 17,443 కోట్లు కేటాయించింది.

నిపుణుల కమిటీ ప్రతిపాదనలకూ తిలోదకాలు..

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటన తరువాత కేంద్ర ప్రభుత్వం 2016 ఏప్రిల్ 13న రైతుల ఆదాయం రెట్టింపు (డిఎఫ్ఐ)పై అశోక్ దల్వాయ్ నేతృత్వంలోని 16 మంది నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 14 సంపుటాలలో రైతుల ఆదాయం రెట్టింపు (డిఎఫ్ఐ)పై నివేదికను సమర్పించింది. 2017 ఆగస్టులో మొదటి సంపుటి విడుదల చేసింది. 2018 సెప్టెంబర్‌లో 14వ సంపుటి వచ్చింది. ఈ కమిటీ 16 సిఫార్సులను చేసింది. అందులో రైతు పండించే పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ఉత్పత్తి వ్యయం కంటే 1.5 రెట్లు ఉండాలని తెలిపింది. అగ్రి మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ రూ. 2,000 కోట్లతో 22,000 గ్రామాల్లో (గ్రామీణ స్థాయి మార్కెట్‌లు, అగ్రిగేషన్ హబ్‌లు) ఏర్పాటు చేయాలని, 585 వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఎపిఎంసి)లను అప్‌గ్రేడ్ చేయాలని సూచించింది. ధర, డిమాండ్ అంచనాలు, ఫ్యూచర్స్, ఎంపికలు, వ్యవసాయం కోసం ఎగ్జిమ్ విధానాలపై విధానాలను అభివృద్ధి చేయడానికి సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని వంటి కొన్ని సిఫార్సులను చేసింది. కానీ మోడీ సర్కార్ ఈ ప్రతిపాదనలనూ పెడచెవిన పెట్టింది.

నీతి ఆయోగ్ చెబుతున్నదేమిటి?

రైతుల ఆదాయాల బెంచ్‌మార్క్ అంచనాలు, వీటిని రెట్టింపు చేయడంపై నీతి ఆయోగ్ వ్యవసాయ ఇన్‌ఛార్జ్ సభ్యుడు రమేష్ చంద్ కొన్ని గణాంకాలు తెలిపారు. ఆయన విడుదల చేసిన డేటా ప్రకారం 2004-05, 2011-12 మధ్య 7.5 శాతం పెరుగుదల ఉన్నట్లు తెలిపారు. 2011-12, 2015-16 మధ్య ఒక్కో సాగుదారునికి నిఖర ఆదాయం ఏడాదికి 0.44 శాతం పెరిగినట్లు చూపించారు. ఇది 1999-2000, 2004-05 మధ్య ఎన్‌డిఎ-1 ప్రభుత్వ కాలంలో ఏడాదికి 0.55 శాతం మేర తగ్గింది. 2016-17, 2020-21 మధ్య డేటా అందుబాటులో ఉన్న చివరి సంవత్సరం, దీని ప్రకారం రైతుల వాస్తవ ఆదాయం 1.5 శాతం క్షీణించింది.

ఇది ఎన్‌డిఎ-1 నాటి వ్యవసాయ సంక్షోభం సమయంలో కంటే మూడు రెట్లు అధిక క్షీణతగా ఉంది. తీవ్ర కరువు నెలకొన్న 2015-16ని బేస్ ఇయర్‌గా ఉపయోగించారు. కానీ కరువు సంవత్సర కాలంలోని ఆదాయ గణాంకాలను కూడా మోడీ సర్కార్ నిర్దేశించుకున్న లక్ష్యం చేరుకోకపోవడం గమనార్హం. 2021-22 డేటా అందుబాటులో లేదు.

ఎన్‌ఎస్‌ఒ, నాబార్డ్ గణాంకాల్లోనూ క్షీణతే

నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్‌ఎస్‌ఒ) సిట్యుయేషన్ అసెస్‌మెంట్ సర్వే (ఎస్‌ఎఎస్) ఆధారంగా పంటల వ్యవసాయం వల్ల రైతు కుటుంబాల ఆదాయం 2012-13, 2018-19 మధ్య ఏడాది 1.5 శాతం క్షీణించింది. 2018-19 తరువాత ఎటువంటి సర్వేలు జరగనందున, 2022లో రైతుల ఆదాయాన్ని అంచనా వేయడానికి మార్గం లేదు. 2015-16 తరువాత రైతు ఆదాయం లోనూ క్షీణత ఉంది. నాబార్డ్ ఆల్ ఇండియా ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ సర్వే (ఎన్‌ఎఎఫ్ఐఎస్)లో భాగంగా గ్రామీణ కుటుంబాల సర్వే వ్యవసాయ కుటుంబాల ఆదాయానికి సంబంధించిన ఇతర డేటా ఎస్‌ఎఎస్‌కి భిన్నంగా ఉంది. అయితే ఆదాయాల వృద్ధి క్షీణతను స్పష్టం చేసింది. వ్యవసాయ కుటుంబాల ఆదాయం 2015-16, 2018-19 మధ్య ఏడాది 1.7 శాతం పెరిగిందని, ఇది మునుపటి కాలంలోని 3.8 శాతం వృద్ధి రేటు కంటే సగం కంటే తక్కువగా ఉందని స్పష్టం చేసింది.

సమానత్వం కోసం సమైక్య పోరాటం

- ఐద్వా అఖిల భారత మహాసభ నినాదం
- జనవరి 6 నుండి 9 వరకు తిరువనంతపురంలో నిర్వహణ
- 850 మందికి పైగా ప్రతినిధులు

తిరువనంతపురం : 'సమానత్వం కోసం సమైక్య పోరాటం' నినాదంతో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 13వ మహాసభ నిర్వహించనున్నట్లు ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు, మహాసభ ఆహ్వాన కమిటీ ఛైర్మన్ పికె శ్రీమతి తెలిపారు. కేరళలోని తిరువనంతపురంలో ఈ నెల 6 నుండి 9 వరకు ఐద్వా మహాసభ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐద్వా కేంద్ర కమిటీ సభ్యులు, ఆహ్వాన కమిటీ కన్వీనర్ టిఎన్ సీమ, రాష్ట్ర కార్యదర్శి, జనరల్ కన్వీనర్ సిఎస్ సుజాతతో కలిసి పికె శ్రీమతి మాట్లాడారు. ఈ మహాసభకు దేశం నలుమూలల నుంచి దాదాపు 850 మంది పైగా ప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆమె తెలిపారు. తిరువనంతపురం ఐద్వా మహాసభకు ఆతిథ్యమివ్వడం ఇది రెండోసారి అని, 36 ఏళ్ళ క్రితం 1986లో మొదటిసారిగా జాతీయ మహాసభ ఇక్కడ జరిగిందని తెలిపారు. 1981లో ఐద్వా ఏర్పడిన సంగతి విదితమే. "సమానత్వం కోసం సమైకత్యతతో పోరాటం" అన్నది ఈ జాతీయ మహాసభ ప్రధానాంశంగా ఉండనున్నట్లు పికె శ్రీమతి పేర్కొన్నారు. బాల్య నృత్య కళాకారిణి, కేరళ కళా మండలం ఛాన్సలర్ మల్లికా సారాభాయ్ జనవరి 6న ఠాగూర్ థియేటర్‌లో జరిగే ప్రతినిధుల సమావేశాన్ని ప్రారంభిస్తారని, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. క్యూబా విప్లవ నేత చె గువెరా కుమార్తె అలెదా గువెరా, ఆమె కుమార్తె ఎస్తెఫానియా మచిన్ గువెరా కూడా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. 'ప్రభుత్వ ప్రాయోజిత తీవ్రవాదం, నేటి భారతదేశం' అనే అంశంపై సెమినార్‌ను సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాడ్ అదే రోజు సాయంత్రం 4 గంటలకు గాంధీ పార్క్‌లో ప్రారంభిస్తారని తెలిపారు. మహాసభ చివరి రోజైన 9న సాయంత్రం 4గంటలకు పుత్తరికండం మైదానంలో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గొంటారని తెలిపారు. గత నాలుగు దశాబ్దాల కాలంలో 98 లక్షల సభ్యత్వంతో ఐద్వా దేశంలోనే ప్రముఖ మహిళా సంస్థగా ఆవిర్భవించింది. మహిళా పోరాటాలు, వారి సమస్యలను ప్రముఖంగా పేర్కొంటూ వాటి పరిష్కారం కోసం పోరు సల్పడంలో, మహిళల అభ్యున్నతికి వివిధ చట్టాలను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది.

మాజీ పోప్ బెన్‌డిక్ట్ కన్నుమూత



వాటికన్ సిటీ : మాజీ పోప్ బెన్‌డిక్ట్-16 శనివారం కన్నుమూశారు. ఆయన వయస్సు 95 సంవత్సరాలు. పోప్‌గా రాజీనామా చేసినప్పటి నుండి నివసిస్తున్న వాటికన్‌లోని మేటర్ ఎక్లెసీ మోనాస్టరీలో ఆయన చనిపోయారని వాటికన్ ప్రతినిధి తెలిపారు. తన సీనియర్ పోప్ బెన్‌డిక్ట్‌కు ఆరోగ్యం బాలేదని, ఆయన కోసం ప్రార్థించాల్సిందిగా గత వారం ప్రస్తుత పోప్ ఫ్రాన్సిస్ ప్రజలను కోరారు. వాటికన్ డాక్ట్రినల్ ఆఫీస్ (సిడిఎఫ్)కు అత్యంత శక్తివంతమైన అధినేతగా దాదాపు 25 ఏళ్ళు బెన్‌డిక్ట్ పనిచేశారు. బెన్‌డిక్ట్‌ను తమ ప్రామాణికమైన దూతగా చర్చిలోని కన్జర్వేటివ్‌లు భావించేవారు. అతి సాంప్రదాయవాదులు మాత్రం ఆయనను చట్టబద్ధమైన చర్చి అధిపతిగా గుర్తించడానికి కూడా తిరస్కరించేవారు. కన్జర్వేటివ్‌లు, ప్రగతిశీలవాదుల మధ్య అభిప్రాయ బేధాలు, నిర్వహణా వైఫల్యాలు, లైంగిక వేధింపుల కుంభకోణాలతో కేథలిక్ చర్చిపై తీవ్ర వివాదాలు చెలరేగిన నేపథ్యంలో గత 600 ఏళ్ళలో రాజీనామా చేసిన తొలి మతాధిపతి పోప్ బెన్‌డిక్ట్ కావడం గమనార్హం. వెయ్యేళ్ళ కాలంలో తొలి జర్మన్ పోప్ అయిన బెన్‌డిక్ట్‌కు తన వారసుడు పోప్ ఫ్రాన్సిస్‌తో సత్సంబంధాలు వున్నాయి. 2013లో పదవి నుండి వైదొలగినా ఆయన వాటికన్‌లోనే కొనసాగుతూ వచ్చారు. ఫ్రాన్సిస్ ప్రగతిశీల ఆలోచనలతో ఆందోళన చెందే కన్జర్వేటివ్‌వాదులు సాంప్రదాయానికి సంరక్షకుడిగా వున్న బెన్‌డిక్ట్ వైపు చూడడం ఆరంభించారు. ఆ సమయంలో పోప్ ఒక్కరే, అది ఫ్రాన్సిస్ అని వారికి అనేక సందర్భాల్లో ఆయన స్పష్టం చేస్తూ వచ్చారు.



గయ డిప్యూటీ మేయర్‌గా పారిశుధ్య కార్మికురాలు

పాట్నా : బీహార్‌లో ఇటీవల జరిగిన రెండో విడత నగర పాలక సంస్థల ఎన్నికల్లో గయ మున్సిపల్ కార్పొరేషన్ సరికొత్త రికార్డు సృష్టించింది. శుక్రవారం ప్రకటించిన ఈ ఎన్నికల్లో గయ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా గణేశ్ పాశ్వాన్ విజయం సాధించగా డిప్యూటీ మేయర్‌గా చింతాదేవి ఎన్నికయ్యారు. ఇదే మున్సిపల్ కార్పొరేషన్‌లో చింతాదేవి పారిశుధ్య కార్మికురాలిగా పని చేయడం విశేషం. ఈ ఎన్నికల్లో డిప్యూటీ మేయర్ పదవి కోసం చింతాదేవితో పాటు 10 మంది పోటీ చేయగా ఆమెకు రికార్డు స్థాయిలో 50,417 ఓట్లు పోలయ్యాయి. సమీప ప్రత్యర్థిపై 16 వేలకు పైగా ఓట్లతో ఆమె ఘన విజయం సాధించారు. ఒక పారిశుధ్యకార్మికురాలు డిప్యూటీ మేయర్ పదవి చేపట్టడం గయ మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలో ఇదే తొలిసారి. చింతా దేవి గత 40 ఏళ్లుగా మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. ఈ సారి రిజర్వేషన్ కారణంగా గయ డిప్యూటీ మేయర్ పదవిని ఆమెను వరించింది. మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందితో పాటు కార్మికుల యూనియన్, స్థానికుల మద్దతుతో ఆమె విజయం సాధించారు. కాగా గయ ఎన్నికల్లో సామాన్యులను ఉన్నత పదవులకు ఎన్నుకోవడం ఇదే తొలిసారి కాదు. గతంలో 1996లో గయ నియోజకవర్గం నుంచి అత్యంత పేద తరగతికి చెందిన భగవతి దేవి లోక్‌సభ ఎంపీగా విజయం సాధించారు. రాళ్లు కొట్టి జీవనం సాగించే ఆమెకు జనతాదళ్ లోక్‌సభ టికెట్ ఇవ్వగా.. ప్రజలు ఆమెను పార్లమెంట్‌కు పంపించారు.

బిజెపిని ఐక్యంగా తిప్పికొడదాం

- ఏం చేయకూడదో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నుంచే నేర్చుకున్నా
- తూర్పు నుంచి పశ్చిమకు మరో యాత్ర
- విలేకర్ల సమావేశంలో రాహుల్ వెల్లడి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పట్ల ప్రజానీకంలో వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉందని, వినాశకర విధానాలతో ప్రజాకంటకంగా మారిన సంఘ్ పరివార్‌ను ఐక్యంగా తిప్పికొట్టాల్సిన అవసరముందని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ తనకు గురువులంటూ ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఏం చేయకూడదో నేర్పింది వాటి నుంచే నేర్చుకున్నానని ఆయన ఎద్దేవా చేశారు. శనివారం నాడిక్కడ ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్‌తో కలిసి రాహుల్ మాట్లాడారు. బిజెపి తనపై ఎంతటి తీవ్ర ఆరోపణలు చేస్తే అంత త్వరగా దాని భావజాలాన్ని అర్థం చేసుకుంటానని చెప్పారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకూ తాను చేపట్టిన భారత్ జోడో యాత్రకు విశేష స్పందన లభించిందన్నారు. తమతో ఎవరు కలిసొచ్చినాకలుపుకొని పోతామన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, బిఎస్‌పి అధినేత్రి మాయావతి ఇరువురు కూడా ప్రేమ పూర్వక భారత్‌ను కోరుకుంటున్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భారత్ జోడో యాత్ర నేపథ్యంలో భద్రతలో వైఫల్యాల పట్ల కూడా రాహుల్ తీవ్రంగా స్పందించారు. తాను పాదయాత్ర చేస్తుంటే..భద్రత రీత్యా బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో వెళ్లాలంటూ కేంద్ర హోంశాఖ చెబుతుంటే ఇక వారి గురించి ఏం చెప్పాలని వ్యాఖ్యానించారు. వ్యక్తులను, పార్టీలను బట్టి ప్రోటోకాల్స్ మారుతాయా? అని నిలదీశారు. బిజెపిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందనీ, ప్రతిపక్షాలు సమర్థవంతమైన సమన్వయంతో బిజెపికి ప్రత్యామ్నాయ విజన్‌ను రూపొందించాల్సిన అవసరముందని తెలిపారు. ప్రతిపక్షాలన్నీ ఏకమైతే 2024లో బిజెపి ఓటమి ఖాయమన్నారు.

తూర్పు నుంచి పశ్చిమకు మరో యాత్ర..!

దేశంలోని తూర్పు-పశ్చిమ ప్రాంతాల మీదుగా మరో యాత్ర చేపట్టేందుకు చర్చలు జరుగుతున్నాయని రాహుల్ తెలిపారు. భారత ప్రజల మనసులోని భావాలను వినాల్సివుందనీ, ప్రజల మాట వినకుండా వేరే ఏదైనా చేస్తే అది భారత గళాన్ని అవమానించడంతో సమానమని రాహుల్ అభివర్ణించారు. ఆర్థిక వ్యవస్థలో కార్పొరేట్ కంపెనీలు పాత్ర చాలా ప్రధానమైనదని, అందుకనే వాటికి అనుకూలంగా ఉన్నామని, అయితే ఆ వ్యవస్థ 'ఇద్దరు ముగ్గురు వ్యక్తులే' నియంత్రించేలా ఉండరాదని రాహుల్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత విదేశాంగ విధానం గందరగోళంగా ఉందని రాహుల్ విమర్శించారు. 'ఉత్పత్తి దేశం'గా భారత్ ఉద్భవించాలనేది తమ ఆశయమని, వైద్య, ఇంజినీరింగ్, సివిల్ సర్వీసెస్, లా వంటివాటిని మించి యువతరం ఊహలకు కొత్త రెక్కలు మొలిచేలా విద్యా విధానం ఉండాలని ఆయన తెలిపారు.

కోవిడ్ కట్టడిలో కొత్త దశలోకి చైనా

- సమైక్యంగా వుండాలని జిన్‌పింగ్ పిలుపు



బీజింగ్ : కరోనా వేళ ప్రజల ప్రాణాలను కాపాడడానికే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నది చైనా విధానమని అధ్యక్షులు జీ జిన్‌పింగ్ చెప్పారు. కొత్త సంవత్సరం 2023 లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా శనివారం ఆయన టివిలో జాతినుద్దేశించి ప్రసంగించారు. కరోనా మహమ్మారి పట్ల దృక్పథంలో 'కొత్త దశ' లోకి ప్రవేశిస్తున్నందున మరింత ఐక్యత, కృషి అవసరమని పిలుపిచ్చారు. కోవిడ్‌కు వ్యతిరేకంగా సాగిన పోరులో అనూహ్యంగా ఎదురైన కష్టాలను, సవాళ్ళను చైనా విజయవంతంగా అధిగమించిందని పేర్కొన్నారు. అవసరమైన పరిస్థితులు తలెత్తినపుడు ఆ సమయం ఆసన్నమైనపుడు కరోనా విధానాలు గరిష్ట స్థాయిలో తీసుకున్నట్లు తెలిపారు. జీరో కోవిడ్ విధానాన్ని రద్దు చేసిన తర్వాత కోవిడ్ కట్టడి కొత్త విధానాలకు సంబంధించి జిన్‌పింగ్ బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం ఇదే ప్రథమం. దాదాపు మూడేళ్ళుగా అనుసరిస్తూ వచ్చిన మూకుమ్మడి పరీక్షలు, కేంద్రీకృత క్వారంటైన్, లాక్‌డౌన్ వంటి చర్యల ప్రాతిపదికన కఠినంగా జీరో కోవిడ్ విధానాన్ని అమలు చేసిన చైనా ఆ తర్వాత ఆ విధానాన్ని రద్దు చేసింది.

గుజరాత్‌లో ఘోర ప్రమాదం

- 9 మంది మృతి

గుజరాత్ : గుజరాత్‌లోని నవసారి జిల్లాలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 9 మంది మృతి చెందారు. మరో 28 మంది తీవ్రంగా గాయపడ్డారు. సూరత్‌లోని ప్రముఖ్ స్వామి మహరాజ్ శతాబ్ది మహోత్సవ్ కార్యక్రమం నుంచి వల్సాద్ వెళ్తున్న లగ్జరీ బస్సు.. డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో బస్సు నియంత్రణ కోల్పోయి కారుపైకి దూసుకెళ్లింది. ప్రమాదం అనంతరం డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ప్రమాదంలో కారులో ఉన్న 9 మందిలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రయాణికులతో కిక్కిరిసి ఉన్న బస్సులోని 28 మంది గాయపడ్డారు.

జమ్మూ కాశ్మీర్‌లో ప్రాథమిక హక్కుల నిరాకరణ

- పునరుద్ధరించాలని సిజెఐకి మెహబూబా ముఫ్తీ లేఖ



శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్ ప్రజల ప్రాథమిక హక్కులు అడుగడుగునా నిరాకరణకు గురి అవుతున్నాయని మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) అధినేత్రి మెహబూబా ముఫ్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌కు ఆమె శనివారం ఒక లేఖ రాశారు. 2019 నుండి ఏకపక్షంగా రద్దు చేసిన ఈ హక్కులను పునరుద్ధరించేందుకు జోక్యం చేసుకోవాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు. జాతీయ భద్రత ప్రయోజనాల పేరుతో సమర్థించుకుంటూ జమ్మూ కాశ్మీర్‌పై కేంద్ర ప్రభుత్వం ఉక్కు పిడికిలి విధానం అమల్జేస్తోందన్నారు. 2019 నుండి జమ్మూ కాశ్మీర్‌లోని ప్రతి ఒక్క పౌరుడి ప్రాథమిక హక్కులన్నీ ఏకపక్షంగా కాలరాశారని పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌ను విలీనం చేసేటపుడు ఇచ్చిన రాజ్యాంగపరమైన హామీలన్నీ అకస్మాత్తుగా, బేషరతుగా నిరాకరించారని తెలిపారు. ప్రజల్లో విశ్వాసం కొరవడుతున్నపుడు, తాము వేరనే భావన బలపడుతున్నపుడు ప్రజానీకంపై మరింత నిర్బంధం కొనసాగుతోందని ముఫ్తీ వాపోయారు. మాజీ ముఖ్యమంత్రిగా, పార్లమెంట్ సభ్యురాలిగా వున్న తన విషయంలోనే ఎలాంటి కారణాలు లేకుండా పాస్‌పోర్ట్‌ను నిలిపివేశారని, పైగా రెండేళ్ళ నుండి తన తల్లి, కుమార్తెల పాస్‌పోర్టులు కూడా అలానే నిలిపివేశారని, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆమె ప్రశ్నించారు. మాజీ కేంద్ర హోం మంత్రి, సీనియర్ రాజకీయ నేత, రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి భార్య అయిన తన తల్లి విషయంలో కూడా సరైన కారణాలు చెప్పకుండానే పాస్‌పోర్ట్‌ను తిరస్కరించారని ఆమె చెప్పారు. పులిట్జర్ అవార్డు గ్రహీత అయిన యువ ఫోటో జర్నలిస్టు తన అవార్డు తీసుకోవడానికి విదేశాలకు వెళ్లలేకపోయారని ఆమె తెలిపారు. ఇటువంటి దుర్భరమైన చీకటి పరిస్థితుల్లో తమకు కనిపిస్తున్న ఏకైక అశాకిరణం న్యాయ వ్యవస్థ మాత్రమేనని ఆమె తెలిపారు. భావ ప్రకటనా స్వేచ్ఛ అణచివేతకు గురౌతోందన్నారు. ఏ నాగరిక సమాజంలోనైనా నిజాన్ని సమర్థించడమనేది ఆనవాయితీగా వుంటుందనీ, కానీ జమ్మూ కాశ్మీర్‌లో మాత్రం భావ ప్రకటనా స్వేచ్ఛ అన్నింటికంటే అధికంగా దెబ్బతింటోందని, సమూలంగా అణచివేస్తున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో న్యాయ వ్యవస్థ అయినా తన విధులను, కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తించగలదని ఆశిస్తున్నట్లు ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

రిట్రెంచ్ టీచర్లందరికీ నియామకాలు

- మాణిక్ సర్కార్ హామీ

అగర్తలా : బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత త్రిపురలో మొత్తంగా 10,323 మంది ఉపాధ్యాయులను తొలగించారని, వామపక్ష సంఘటన (లెఫ్ట్‌ఫ్రంట్) తిరిగి అధికారంలోకి వస్తే ఆ ఉపాధ్యాయులందరినీ వారి ఉద్యోగాల్లో నియమిస్తామని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, త్రిపుర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత మాణిక్ సర్కార్ హామీ ఇచ్చారు. ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లకు బాసటగా నిలవాలని తమ పార్టీ భావించిందని చెప్పారు. కుమార్‌ఘాట్‌లో జరిగిన పార్టీ కార్యక్రమానికి శుక్రవారం హాజరైన ఆయన ఒక పత్రికా సమావేశంలో మాట్లాడారు. గతంలో ప్రజల సమస్యలను పరిష్కరించింది వామపక్ష ప్రభుత్వమేనని, భవిష్యత్తులో కూడా అదే జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు ఆలోచిస్తున్న తీరుతో ముఖ్యమంత్రి, ఆయన పార్టీ ఆందోళన చెందుతున్నారని అన్నారు. రిట్రెంచ్ అయిన ఉపాధ్యాయుల్లో మరో టీచర్ దీపికా దాస్ చౌదరి (53) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారు జామున మరణించారు. బిజెపి దీపికా దాస్ లాంటి ఉపాధ్యాయులందరినీ తొలగించిన నాటి నుంచి వారంతా తీవ్రమైన మనోవేదనకు గురై అస్వస్థతకు గురౌతున్న సంగతి తెలిసిందే.

బుల్డోజర్ రాజకీయం

- యూపీ నుంచి ఎంపీ దాకా అరాచకత్వం
- రెచ్చిపోయిన బిజెపి ప్రభుత్వాలు
- అణగారిన వర్గాల ప్రజల ఇండ్లు, నిర్మాణాలు కూల్చివేత

న్యూఢిల్లీ : దేశంలో అణగారిన వర్గాల ప్రజలపై బీజేపీ బుల్డోజర్ రాజకీయాలు పీడకలను మిగిల్చాయి. ఆక్రమణల పేరుతో కేవలం ఒక వర్గం వారినే లక్ష్యంగా చేసుకుంటూ ఈ రాజకీయాలు సాగాయి. ఈ ఏడాదిలో (2022లో) యూపీలో రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత అక్కడి యోగి ప్రభుత్వం రెచ్చిపోయింది. బుల్డోజర్లతో అక్రమ నిర్మాణాలుగా చెప్పబడిన ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసింది. కనీసం ఒక నిర్దిష్ట ప్రక్రియను పాటించకుండా నియంతృత్వంగా వ్యవహరించింది. గొడవలు జరిగాయని తెలిసిన వెంటనే.. అక్కడికి బుల్డోజర్లు దిగడం.. ఒక వర్గం వారిని లక్ష్యంగా చేసుకుంటూ వారి ఇండ్లను కూలగొట్టడం వంటివి యోగి సర్కారు చేసింది. బాధితులకు అండగా నిలిచి ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ప్రతిపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయి. అడ్డూ, అదుపు లేకపోవడంతో యోగి ప్రభుత్వం తన నిజస్వరూపాన్ని మరింతగా బయటపెట్టి కఠినంగా వ్యవహరించింది. యోగి సర్కారు బుల్డోజర్ రాజకీయం ఇతర రాష్ట్రాలకూ పాకింది. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్, మధ్యప్రదేశ్, గుజరాత్, అసోం, బీహార్ వంటి రాష్ట్రాలూ బుల్డోజర్లను అమాయకపు ప్రజల ఇండ్లపై ప్రయోగించాయి.

ఢిల్లీ : ఈ ఏడాది ఏప్రిల్ 20న అధికారులు జహంగీర్‌పురిలోని మసీదు ద్వారం కూల్చారు అక్కడి మునిసిపల్ అధికారులు. అదే నెల 16న హనుమాన్ జయంతి సందర్భంగా బజరంగ్‌దళ్ సభ్యులు ఊరేగింపు వెళ్తున్న సందర్భంగా వారు ముస్లింలతో ఘర్షణకు దిగారు. అయితే, కోర్టు ఆదేశాలున్నప్పటికీ.. అదేమీ పట్టించుకోని అక్కడి మునిసిపల్ యంత్రాంగం (బీజేపీ నేతృత్వంలోని) మసీదు గేటును కూల్చివేసింది. జులై 6న ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ (డీడీఏ) న్యూఢిల్లీలోని నిజాముద్దీన్ ఈస్ట్‌లోని సరాయ్ కాలే ఖాన్ ఎదురుగా ఉన్న గయాస్‌పూర్ బస్తీలో 60కి పైగా అద్దెదారులపై బుల్డోజర్‌ను ప్రయోగించింది. అలాగే, అంగన్వాడీలను కూడా కూల్చేసింది. కానీ, ఒక గోశాలను మాత్రం కనీసం ముట్టుకోకపోవడం గమనార్హం.

యూపీ: ఈ ఏడాది మార్చి 21న ఇద్దరు లైంగికదాడి నిందితులు అమీర్, ఆసిఫ్ ల ఇంటికి బుల్డోజర్‌ను తీసుకొచ్చి వారిని లొంగిపోయేలా బలవంతం చేసింది అక్కడి ప్రభుత్వం. ఈ క్రమంలో నిందితులు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని యూపీ పోలీసులు కోర్టులో కూడా అంగీకరించడం గమనార్హం. ఏప్రిల్ 13న రాంపూర్ జిల్లా పోలీసులు హత్య నిందితుడి ఇంటిని కూల్చివేయడంపై విచారణకు ఆదేశించారు. సహారాన్‌పూర్‌లో ఇద్దరు నిందితులు అబ్దుల్ వాకీర్, ముజమ్మిల్‌ల ఆస్తులను కూల్చినట్టు ఎస్ఎస్పీ ఆకాశ్ తోమర్ అంగీకరించారు. జూన్ 13న ప్రయాగ్‌రాజ్ డెవలప్‌మెంట్ అథారిటీ జావేద్ మొహమ్మద్ (అలియాస్ జావేద్ పంప్) ఇంటిని కూల్చేసింది. డిసెంబర్ 10న జైషే మహ్మద్ కమాండర్‌గా భావిస్తున్న ఆషిక్ నెంగ్రూ ఇంటిని కూల్చివేశారు.

మధ్యప్రదేశ్ : ఏప్రిల్ 10న ఎంపీలోని ఖర్గోన్‌లో రామనవమి సందర్భంగా రాళ్లదాడి జరిగింది. ఇందులో దాదాపు 80 మందిని అక్కడి ప్రభుత్వ అరెస్టు చేసింది. అయితే, హింసాకాండకు పాల్పడిన వారి 45 ఇండ్లను కూల్చివేశారని ఇండోర్ డివిజనల్ కమిషనర్ పవన్ శర్మ వెల్లడించడం గమనార్హం. అలాగే, షియోపూర్‌లో సామూహిక లైంగికదాడి కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు మైనారిటీ వర్గానికి చెందిన వారి ఇండ్లను శివరాజ్‌సింగ్ చౌహాన్ సర్కారు కూల్చివేసింది. పోలీసుల సమక్షంలోనే వారి ఇండ్లు బుల్డోజర్లతో నేలమట్టం కావడం గమనార్హం. మొరెనా జిల్లాలోని బాన్‌మోర్ పట్టణంలో లైంగికదాడి నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న గిర్రాజ్ రజాక్ అనే రోజువారీ కూలీ ఇంటిని 'అక్రమ నిర్మాణం'గా పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేసింది.

గుజరాత్ : ఏప్రిల్ 10న ఆనందద్ జిల్లాలోని ఖంబత్ పట్టణంలో రామ్‌నవమి ఊరేగింపు సందర్భంగా రాళ్లు రువ్విన ఆరోపణలు వచ్చాయి. అనంతరం ఆ జిల్లా కలెక్టర్.. ప్రభుత్వ భూమిలో ఉన్న అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఆదేశించారు. వీటిలో చాలా వరకు ఘర్షణల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక వర్గానికి చెందినవారివే కావడం గమనార్హం. ఏప్రిల్ 21న సూరత్ మునిసిపల్ కార్పొరేషన్ పోలీసులతో కలిసి గ్యాంగ్‌స్టర్ సోదరులు ఆరిఫ్, సజ్జు కొఠారీకి చెందిన ఆస్తులను కూల్చేసింది. అక్టోబరులో బెట్ ద్వారకా ద్వీపంలో సుమారు 10వేల మంది జనాభా ఉన్న 100 నిర్మాణాలు కూల్చివేయబడ్డాయి. వీటిలో ఎక్కువ భాగం మైనారిటీ సామాజికవర్గానికి చెందినవారివే కావడం గమనార్హం. నవంబర్‌లో, కచ్ జిల్లాలోని జఖౌ హార్బర్‌లో 300 ఇండ్లు, గుడిసెలు, గోడౌన్‌లు అక్రమంగా ఉన్నాయని భావించి కూల్చేశారు. దీంతో మత్స్యకారులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

అసోం : మే 21న అసోంలోని నాగోన్ జిల్లాలోని ఎనిమిది ఇండ్లను అక్కడి అధికారులు కూల్చేశారు. జంతు హక్కుల కార్యకర్త వినీత్ బగారియా ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న బైదుల్లా ఖాన్ నివాసాన్ని జులై 12న దిబ్రూఘర్ జిల్లా యంత్రాంగం కూల్చివేసింది. అదేనెలలో, కరీంగంజ్‌లోని ముస్లిం ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో 90 ఇండ్లు ఆక్రమణల వ్యతిరేక డ్రైవ్‌లో నేల మట్టమయ్యాయి. అయితే, తమ వద్ద భూమికి సంబంధించిన పత్రాలున్నాయని బాధితులు వెల్లడించడం కొసమెరుపు. సెప్టెంబరులో 100 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం బోర్కొల్లా నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ భూమిలో నివసిస్తున్నారని పేర్కొంటూ 299 కుటుంబాలను అక్కడి నుండి ఖాళీ చేయించారు. వీరిలో 243 మంది మైనారిటీ వర్గాలకు చెందిన కుటుంబాలే కావడం గమనార్హం.

బీహార్ : బీజేపీతో జేడీ(యూ) కొనసాగించిన సంకీర్ణ ప్రభుత్వంలోనూ బుల్డోజర్ రాజకీయాలు సాగాయి. ఏప్రిల్‌లో బీహార్ రెవెన్యూ మంత్రి రామ్ సూరత్ రాయ్ (బీజేపీ) పరారీలో ఉన్న నేరస్థులు, రాష్ట్ర ప్రభుత్వ భూమిని ఆక్రమించే వారిపై బుల్డోజర్ డ్రైవ్‌ను ప్రారంభిస్తామని హెచ్చరించారు. అయితే, ఆయన ప్రకటనను సీనియర్ జేడీ(యూ) నాయకుడు ఉపేంద్ర కుష్వాహ వ్యతిరేకించడం గమనార్హం. అయినప్పటికీ కొన్ని చోట్ల బీజేపీ మంత్రుల ఒత్తిళ్లతో నిర్మాణాల కూల్చివేతలు జరిగాయి. అయితే, ఇలాంటి విషయాల్లో పాట్నా హైకోర్టు అధికారుల తీరునే తప్పుబట్టడం గమనార్హం.

ప్రియమారా స్వాగతం ...

కొత్త సంవత్సరానికి స్వాగతం! ఆడంబర సంబరాలతో స్వాగతం.
ఆశల ఆకాంక్షల తోరణాలతో స్వాగతం.
కొమ్మల రెమ్మలపై, చివురాకుల చివర్లపై, గడ్డిపూల రేకలపై
మంచుబిందువులు గోముగా ముద్దాడినంత ప్రియంగా స్వాగతం.
ఆత్మీయంగా స్వాగతం.
పెల్లుబికిన ఉత్సాహాల వెల్లువలో ప్రేమారా స్వాగతం.

కాలమా,

నీలో నువ్వే ముసిముసిగా నవ్వుకుంటావు కదూ? వచ్చి పోయే వత్సరాల చేతిలో ఏ మహత్తూ లేదని తెలిసి కూడా ప్రతి ఏటా ఆకాశానికి చిల్లులు పడేంత డాబు సరి ధూం ధాంలను చూసి– నవ్వుకుంటావు కదూ!? నవ్వుకో. నర్మగర్భంగా ఇంకేమన్నా అనుకో. కాలం మేలు చేయాలని, వేనవేల కాంతిపుంజాలు మా జీవితాల నిండా ప్రసరించాలని ఇష్టంగా కోరుకుంటాం మేం. వినువీధి అచ్చెరువొందేలా ధగద్ధగల కాంతులతో మిరుమిట్లు గొలిపిస్తాం.

కాలమా,

నువ్వు మహాబిలంలోకి నిశ్శబ్దంగా జారిపోయే జాలానివి. సర్వ సంఘటనలకు సాక్షివి. ఇటూ అటూ ఎటూ మొగ్గని విస్పష్ట సరళలేఖవి. మా సుఖాలను సంతోషాలను ఆనందాలను దు:ఖాలను కష్టాలను నష్టాలను మాకు మేమే నీపై లిఖించుకునే విశాల విస్తార లేఖవి. రేపో ఎల్లుండో, ఆపై రోజో, ఆ తరువాతనో ... ఏఏ పరిణామాలు సంభవించినా వాటన్నిటినీ నిరాపేక్షంగా వీక్షిస్తూ సాగిపోయే నిమిత్తమాత్రానివి. నడుస్తున్న చరిత్రను నమోదు చేసుకునే నామమాత్రపు సూత్రానివి. ఎక్కడా ఏక క్షణం కూడా వేచి యోచించని యాంత్రిక ప్రవాహానివి. సంబరంగా స్వాగతించినా ఉప్పొంగిపోవు. నిమ్మళంగా వీడ్కోలు పలికినా నీరసించిపోవు. నీ చుట్టూ అల్లుకున్న ఆశలన్నీ మావే! నీ చుట్టూ కట్టుకున్న కోటలన్నీ మావే! ఏవి ఎంతవరకు నెరవేరతాయో! ఏవి ఏ మేర నిజమై నిలబడతాయో! "అంతా కాలం చేతిలోనే ఉంది" అని మేమంటే, అనుకుంటే మళ్లీ మళ్లీ నిశ్శబ్దంగా నవ్వుకుంటావు, కదూ!

న్నిజమే!

నిజానికి నీ చేతిలో ఏముంటుంది? ఒక నిర్నిమిత్త సాక్షిగా కదిలిపోవడం తప్ప – నువ్వేం చేస్తావు? ప్రజలో పాలకులో, పీడితులో పీడకులో ఎవరు ఏం చేస్తే దానిని కళ్లార్పకుండా చూస్తావు. ఏది ఎలా సాగాలో నిర్ణయించాల్సింది జనమే. వాస్తవానికి దిద్దాల్సింది, వక్రగతిని సరిదిద్దాల్సిందీ ప్రజలే! ఎవరికి వారు వ్యక్తిగతంగా, అందరికి అందరూ సామూహికంగా లక్ష్యాలను సాధించే ప్రయత్నం చిత్తశుద్ధితో చేయాల్సిందే! కాలమే అంతా నిర్ణయిస్తుంది అనుకోవడం భ్రమ. ఒక అచేతన స్థితికి ఆనవాలు. ఒక నిస్సహాయ నిరీక్షణకు ప్రతీక. ప్రమేయమూ, ప్రయత్నమూ లేని గాలివాటు ప్రయాణం. తిన్నామా తిరిగామా పడుకున్నామా తరహా పలాయనవాద పారాయణం.



వ్యక్తులైనా వ్యవస్థలైనా కాలం కారణంగా మార్పు సాధించిన నిదర్శనాలు ఎక్కడా లేవు. వ్యక్తిగత లక్ష్యాలైనా, సమాజ లక్ష్యాలైనా ప్రణాళికాబద్ధమైన కృషితోనే సాధ్యం. సాధించినవాళ్లంతా ఆ స్థానానికి చేరింది మొక్కవోని సాధనతోనే. మారిన వ్యవస్థలన్నీ ప్రజల అవిరళ సమిష్టి పోరాటాలతోనే. ఎక్కడి పాలకులైనా ప్రజాహితంగా ఉన్నప్పుడే పది కాలాల పాటు నిలుస్తారు. ప్రజాకంటకంగా పాలన సాగించినప్పుడు చరిత్ర పుటల్లో కలుస్తారు. అంతిమంగా ప్రజలే చరిత్ర నిర్మాతలవుతారు.

అయితే, 'మాకు మేమే' అనుకొని, సంకుచిత గీతలు గీసుకున్న మనుషులెవరూ సామాజిక మార్పులు సాధించలేరు. మార్పు రాదని తిట్టుకునేవాళ్లు, మార్పులో తమ పాత్ర అక్కర్లేదని దాక్కునేవాళ్లూ ... జారిపోయే నీటి ప్రవాహంలో పారిపోయే జడుపు చేపల్లాంటివాళ్లు. పాలకుల మాయావలల్లో చిక్కుకొని మురిసిపోయే రెక్కలిరిగిన పావురాళ్లు. మతాల మత్తులో, కులాల కంపులో, ప్రాంతాల సరిహద్దుల్లో కూరుకుపోయే సంకుచిత గుంపులు. ఇలాంటి బాపతు పెచ్చుపెరిగితే – ఏ కాలం మాత్రం కాంతిపుంజాలను చూడగలదు? ఏ సంవత్సరం మాత్రం మంచి మార్పులను నమోదు చేయగలదు?

మళ్లీ కోవిడ్ భయం రంకెలు వేస్తోంది. ఆర్థిక సంక్షోభం అలముకుంటోంది. నీ రాకకు ముందే రగులుతున్న భయాలు ఈ రెండూ. ఈ ఏడాది ఏఏ ప్రభావాలను కలిగిస్తాయో, ఎంతెంత నష్టం కలిగిస్తాయో, ఏఏ రూపాల్లో నియంత్రిస్తాయో – అంతా మా పాలకుల చేతిల్లోనే ఉంది. పాలకులు ఏం చేయాలో నిర్దేశించే శక్తి ప్రజల చేతుల్లో ఉంది. మా శక్తిని మేం శక్తివంతంగా, యుక్తివంతంగా ఉపయోగించనంతకాలం మేం ఓడిపోతూనే ఉంటాం. నీ హయాంలో ఏం జరుగుతుందో మరి, వేచి చూద్దాం.

కొత్త సంవత్సరమా,

నువ్వు ఎన్నికలకు ముందు సంవత్సరానివి. అన్ని పార్టీల ప్రయత్నాలకు, వ్యూహాలకు వేదికవి. ప్రజల ఆశలూ ఆకాంక్షలూ బలంగా వ్యక్తమయ్యే ఉద్యమాల నిర్మాణ కాలానివి కూడా! పెరిగే ధరలకు కళ్లెం పడుతుందా? అందరికీ ఇళ్లూ ఉద్యోగాలూ అన్న హామీ కొంత మేరకైనా నెరవేరుతుందా? నిరుద్యోగ అభ్యర్థికి ఉద్యోగం లభిస్తుందా? వంటగ్యాసు అందుబాట్లో ఉంటుందా? అన్నీ ప్రశ్నలే! నిత్య జీవన సమరంలో వెంటాడే యాతనలే! ఈ అసలు సమస్యలను గంపగుత్తగా పక్కన పెట్టి – మతాన్నో, పక్కదేశపు సరిహద్దునో దేశం ముంగిట్లోకి తీసుకొచ్చే ఉన్మాదపు వ్యూహాల కాలం ఇది! ఆ వ్యూహాల గేలానికి చిక్కుకోకుండా ప్రజలు ఉండగలిగితే– ప్రజా సమస్యల చర్చ. ఆ ఎత్తుగడల మత్తుకు చిక్కి చిత్తయిపోతే– ఉన్మాదపు ఉచ్చులో మళ్లీ దేశానికి పరీక్ష!

నువ్వేం చేయగలవు! నిమిత్త మాత్రానివి. నిశ్శబ్ద సాక్ష్యానికి. అనంతకాలంలో ఒక చిన్న శకలానివి. మా చేతలను చరిత్రగా నమోదు చేసే స్వచ్ఛమైన పత్రానివి. నీ సమక్షాన నీ సస్సాక్ష్యాన గొప్ప చరిత్రనే నిర్మిస్తామని .. అదిగో .. విశాఖ ఉక్కు కార్మికులు గట్టి సంకల్పంతో పోరాటం సాగిస్తూనే ఉన్నారు. కన్నతల్లి లాంటి ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటుపరం కానివ్వబోమని పిడికిళ్లు బిగించి, నిర్విరామంగా నినదిస్తున్నారు. ఉద్యోగ భద్రత కోసం, ఉపాధి కోసం, న్యాయబద్ధమైన హక్కుల కోసం, మహిళల రక్షణ కోసం, శాస్త్రీయమైన విద్య కోసం ... దేశం నలుమూలలా కోట్లాది గొంతులు ధ్వనిస్తూనే ఉన్నాయి. విడివిడి గొంతులు ఒక్కటై, కలివిడిగా కదలబారినప్పుడు ... కంటకంగా కర్కశంగా తయారైన పడివాదులపై కలబడి పోరాడినప్పుడు ... మార్పు కచ్చితంగా వస్తుంది. తూర్పు భళ్లున తెల్లారుతుంది.

నూతన సంవత్సరమా,
నీ నుదుటిన పొద్దు పొడుపు ఎర్రమందారమై విరబూస్తుంది.
నీ హయాంలో కొంతలో కొంతయినా చరిత్రను ముందుకు నడిపిస్తుంది.
మనసారా ఆశిస్తున్నాం ఇలా ..
ప్రియమారా పాటిస్తాం ఇలా ...
మరోసారి స్వాగతం. పుడమి పొత్తిళ్లలో ప్రియబాలగా ఉదయిస్తున్న నీకు ఇష్టంగా స్వాగతం..

- జీవన డెస్క్





క్యాలెండర్ పుట్టుక

పిల్లలూ, నూతన సంవత్సరం వచ్చింది. క్యాలెండర్ మారుతుంది కదా! మరి క్యాలెండర్ ఎలా పుట్టింది. దాని గురించి తెలుసుకుందామా!

కాలానుగుణంగా తయారుచేసుకున్నదే క్యాలెండర్. భూమి సూర్యుని చుట్టూ తిరగడం, రోజులో రాత్రి–పగలు ఏర్పడటం. అమావస్య, పౌర్ణమిలు సంభవించడం. వాతావరణంలో మార్పులు. వర్షాలు కురవడం, చలి, వేడి పుట్టడం ఇలా కాలంతో మార్పులు చోటు చేసుకోవడాన్ని గమనించాడు మనిషి. ఈ మార్పుల క్రమాన్ని అర్థం చేసుకొని, దాన్ని అనుసరించటం మొదలు పెట్టాడు. ఆ మార్పులకు అనుగుణంగా జీవించడానికి ప్రయత్నిస్తూ తన జీవన ప్రమాణాలను మార్చుకున్నాడు. దైనందిన వ్యవహారాలను సులభంగా చక్కదిద్దుకోవడానికి, సూర్య–చంద్రుల గమనాన్ని తెలుసుకోవడానికి, ఇలా రకరకాల కారణాలతో కాలాన్ని లెక్కించటం మొదలు పెట్టాడు. ఇలాంటి 'కాలగణన'ను సూచించేదే క్యాలెండర్.

వివిధ దేశాల్లో, వివిధ నాగరికతల్లో, వాళ్ళ వాళ్ళ జీవన విధానాన్ని అనుసరిస్తూ పూర్వం పలు రకాల క్యాలెండర్లు అమల్లోకి వచ్చాయి.కాని దాదాపుగా ప్రపంచం మొత్తం వాడే కాలెండరు గ్రెగోరియన్ కేలండరు. నేపుల్సుకు చెందిన అలోయిసియస్ లిలియస్ అనే వైద్యుడు జూలియన్ కాలెండరు తయారుచేశారు. దీనిలో చేసిన సవరణల ఫలితమే ఈ కాలెండరు. దీన్ని పోప్ గ్రెగొరీ XIII తయారుచేయించి 1582 ఫిబ్రవరి 24 న అమలుపరచాడు. ఆయన పేరు మీదుగా దీనికి గ్రెగోరియన్ కాలెండరు అనే పేరు వచ్చింది. భూమి, సూర్యుని చుట్టూ తిరిగి రావడానికి 365 రోజుల 12 నిమిషాలు పడుతుంది. దాన్ని ఆధారంగా చేసుకుని ఒక సంవత్సరంలో 365 రోజులు ఉండేలా క్యాలెండర్ రూపొందించారు. భూమి తన చుట్టూ తాను తిరిగేందుకు 24 గంటలు పడుతుంది. దాన్ని ఒక రోజుగా లెక్కించారు. రుతువుల ప్రామాణికంగా 12 నెలలు, అందులో నాలుగు, ఐదు వారాలు రూపొందించారు. ఈ క్యాలెండర్‌ను ప్రపంచ దేశాలు అనుసరిస్తున్నాయి.

రంగవల్లి



కె బాల యశ్వంత్, కుంచనపల్లి, గుంటూరు జిల్లా.

9 చుక్కలు 5 వచ్చేవరకు (మధ్య చుక్క)








మండ దుర్గా లావణ్య, గుడివాడ.
12 చుక్కలు 2 వరుసలు 2 వచ్చే వరకు (సరి చుక్క)

మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com వాట్సాప్ : 83329 25496



ఫ్రాంచైజీగా రాజమౌళి, మహేష్ సినిమా

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు చేయనున్న సినిమా గురించి రచయిత విజయేంద్ర ప్రసాద్ ఓ ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. ఈ చిత్రాన్ని ఫ్రాంచైజీగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. 'మహేశ్ బాబు–రాజమౌళి ప్రాజెక్ట్ ఫ్రాంఛైజీగా రానుంది. ఈ సినిమా నుంచి సీక్వెల్స్ వస్తుంటాయి. సీక్వెల్స్‌లో కథలు మారుతుండొచ్చు. కానీ, ప్రధాన పాత్రలు మాత్రం అవే ఉంటాయి. ప్రస్తుతం పార్ట్–1 స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నాం' అని వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారడంతో మహేశ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఓటీటీలోకి హిట్-2

హీరో అడివిశేష్ థ్రిల్లర్ జానర్‌లో నటించిన చిత్రం హిట్–2. సైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రం డిసెంబర్ 2న థియేటర్స్‌లో విడుదలైంది. ఇప్పుడు ఓటీటీలోకి వస్తోంది. ఈ సినిమా హక్కులను ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. ఇక అడివిశేష్ ఈ సినిమాతో వరుసగా ఆరు హిట్లు సాధించి డబుల్ హ్యాట్రిక్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ చిత్రంలో అడివిశేష్‌కు జోడీగా మీనాక్షి చౌదరీ నటించింది. కోమలి ప్రసాద్, రావు రమేష్ కీలకపాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమాస్ బ్యానర్‌పై హీరో నాని, ప్రశాంత్ తిపిరినేని నిర్మించాడు.

'వీరసింహా రెడ్డి' మేకింగ్ వీడియో

నందమూరి బాలకృష్ణ నటించిన చిత్రం 'వీర సింహా రెడ్డి'. సంక్రాంతి బరిలో ఉన్న ఈ చిత్రం మేకింగ్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఇప్పటికే రిలీజైన పోస్టర్‌లు, గ్లింప్స్ సినిమాపై విపరీతమైన అంచనాలు క్రియేట్ చేశాయి. అవుట్ అండ్ అవుట్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి గోపిచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నాడు. బాలయ్య యాక్షన్ సన్నివేశాలు, షూటింగ్ సెట్స్, గుడి విజువల్స్‌ను వీడియోలో చూపించారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాను మైత్రీ మూవీ సంస్థ నిర్మించింది. బాలయ్య ఈ చిత్రంలో ద్విపాత్రాభినయం చేయనున్నాడు. శృతి హాసన్ హీరోయిన్‌గా నటిస్తుంది. కన్నడ యాక్టర్ దునియా విజయ్ ప్రతినాయకుడి పాత్ర పోషించనున్నాడు. ఈ సినిమా జనవరి 12న రిలీజ్ కానుంది.





శరవేగంగా 'డెవిల్'

నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా తెరకెక్కుతోన్న 'డెవిల్' 'ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్' చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. నవీన్ మేడారం దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం తాజాగా మూడో షెడ్యూల్ పూర్తిచేసుకుంది. యూనిట్ అంతా ఈ షూట్ పూర్తి చేసాక ఓ ఫోటో రిలీజ్ చేశారు. దీంతో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ని అతి త్వరలోనే రిలీజ్ చేయనున్నట్టుగా మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

'ప్రాజెక్ట్-కె' మూవీ స్పెషల్ వీడియో

అభిమానులు ఎంతో ఆత్రుతతగాఎదురు చూస్తున్న ప్రభాస్ సినిమా నుంచి అప్‌డేట్ వచ్చింది. ఆయన నటిస్తున్న 'ప్రాజెక్ట్–కె' చిత్రం పాన్ ఇండియాగా రూపొందుతుంది. న్యూ ఇయర్ కానుకగా దర్శకుడు నాగ్ అశ్విన్ 'బృందం రీ ఇన్వెంటింగ్ ది వీల్' అని వీడియోను రిలీజ్ చేశారు. చిత్రబృందం ఒక వీల్‌ను తయారు చేయడానికి ఎంత కష్టపడ్డారో చూపించారు. సినిమా కొత్తగా ఉండబోతుందని అర్థమవుతోంది. ఒక్క టైర్ కోసం బృందం ఇంత కష్టపడితే.. సినిమా కోసం ఇంకెంత కష్టపడుతున్నారో అని పలువురు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. సై–ఫై జానర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా ఫ్యూచర్ గురించి ఉంటుందని, వరల్డ్ వార్–3 టైమ్ లైన్‌లో ఈ సినిమా జరుగుతుందని సమాచారం. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై అశ్వినీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో దీపికా పదుకొనే నటిస్తుంది. అమితాబ్ బచ్చన్ కీలకపాత్ర పోషిస్తున్నాడు.



పంత్ కోలుకోవడానికే ఆరు నెలలు..

ఈ ఏడాది కష్టమే

న్యూఢిల్లీ : కారు ప్రమాదంలో గాయపడిన టీమిండియా వికెట్‌కీపర్ రిషబ్ పంత్ కోలుకోవడానికే కనీసం ఆరు నెలలు పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం డెహ్రాడూన్‌లోని మ్యాక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పంత్‌ను మరింత మెరుగైన వైద్యం కోసం ఢిల్లీకి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పంత్ కోలుకునేందుకు కనీసం ఆరు నెలలు పడుతుందని వైద్యులు పేర్కొన్నారు. దీంతో ఈ ఏడాది ఆయన క్రికెట్ ఆడడం కష్టమనిపిస్తోంది.

దీంతో జనవరిలో ఆస్ట్రేలియాతో జరగనున్న బోర్డర్–గవాస్కర్ టెస్టు సిరీస్‌తో పాటు ఐపిఎల్ 2023 సీజన్‌లో పంత్ ఆడకపోవచ్చు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆయన ఎప్పుడు కోలుకుంటాడో చెప్పలేని పరిస్థితి ఉంది. లిగమెంట్ గాయం నుంచి పంత్ కోలుకోవాలంటే కనీసం మూడు నుంచి ఆరు నెలల సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. ఒకవేళ నొప్పి తీవ్రంగా ఉంటే అప్పుడు మరింత సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో పంత్ రాణించిన విషయం తెలిసిందే. పంత్ ఆడలేని పక్షంలో.. కెఎస్ భరత్‌కు వికెట్ కీపింగ్ బాధ్యతలు దక్కే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ క్రికెట్ సంగతి పక్కనబెడితే ఐపిఎల్‌లో పంత్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. పంత్ అందుబాటులోకి రాకపోతే జట్టు యాజమాన్యం మరో ప్లేయర్ కోసం ఎదురుచూడాల్సిందే.

కోహ్లి ట్వీట్

పంత్ త్వరగా కోలుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. టీమిండియా స్టార్ విరాట్ కోహ్లి సైతం.. **"త్వరగా కోలుకో పంత్.. నీకోసం ప్రార్థిస్తున్నా"** అంటూ ట్వీట్ చేశాడు. కాగా వచ్చే నెలలో స్వదేశంలో శ్రీలంకతో జరిగే ఆరు మ్యాచ్‌ల సిరీస్‌కు పంత్ దూరంగా ఉన్నాడు. ఇప్పటి వరకు పంత్ 33 టెస్టులు ఆడి 2,271 పరుగులు సాధించాడు. 30 వన్డేల్లో, 66 టి20 మ్యాచ్‌ల్లోనూ పంత్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు.





ఉత్తమ క్రికెటర్ల జాబితా విడుదల

టెస్టుల్లో పంత్.. టి20ల్లో సూర్య

ముంబయి : 2022 ఏడాదికి గానూ టీమిండియా నుంచి మూడు ఫార్మట్లలో ఉత్తమ ప్రదర్శన చేసిన క్రికెటర్ల జాబితాను బిసిసిఐ శనివారం విడుదల చేసింది. ఈ జాబితాలో టెస్టు ఫార్మాట్‌లో బ్యాటింగ్ విభాగంలో పంత్ చోటు దక్కించుకోగా.. బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా ఎంపికయ్యాడు. వన్డే ఫార్మాట్‌లో శ్రేయాస్ అయ్యర్, మహ్మద్ సిరాజ్‌లు.. టి20 ఫార్మాట్ నుంచి సూర్యకుమార్ యాదవ్, భువనేశ్వర్ కుమార్‌లకు చోటు కల్పించింది.

టెస్టుల్లో పంత్, బుమ్రా

ఈ ఏడాది 7 టెస్టు మ్యాచ్‌లు ఆడిన పంత్ 680 పరుగులు సాధించాడు. వీటిలో రెండు సెంచరీలు, నాలుగు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. భారత బౌలర్లలో బుమ్రా ఈ ఏడాది అత్యధిక వికెట్లు పడగొట్టాడు. ఐదుటెస్టుల్లో 20.31 సగటుతో 22 వికెట్లు తీశాడు. రెండుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు.

వన్డే ఫార్మాట్‌లో..

మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 17 మ్యాచ్‌లు ఆడిన అయ్యర్ 55.69 సగటుతో 724 పరుగులు చేశాడు. ఇందులో 6 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇక బౌలింగ్‌లో మొహమ్మద్ సిరాజ్ ఈ ఏడాది ఆకట్టుకున్నాడు. 15 మ్యాచుల్లో అతను 24 వికెట్లు తీశాడు.

రూ.4,400 కోట్లకు రొనాల్డోతో సౌదీ అరేబియా క్లబ్ ఒప్పందం



ఫుట్‌బాల్ దిగ్గజ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో సౌదీ అరేబియా క్లబ్‌తో ఒప్పందం చేసుకున్నాడు. రూ.4,400 కోట్లకు రొనాల్డోతో ఒప్పందం చేసుకున్నట్లు సౌదీ అరేబియా ఫుట్ బాల్ క్లబ్ అల్ నాసర్ ప్రకటించింది. 37 ఏళ్ల రొనాల్డో అల్ నాసర్ క్లబ్ మూడేళ్ల పాటు ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యధిక ధర కలిగిన ఆటగాడిగా రొనాల్డో సరికొత్త రికార్డు సృష్టించనున్నాడు. అల్ నాసర్ క్లబ్ తరపున మైదానంలోకి దిగనున్న రొనాల్డో తన జెర్సీని ఆవిష్కరించాడు. "అల్ నాసర్ క్లబ్ తరపున ఆడేందుకు ఆతతగా ఎదురుచూస్తున్నా.. ఇప్పటికే అనేక లీగ్‌లు, టోర్నీలను గెలిచాను. ఆసియా ఆటగాళ్లతోనూ నా అనుభవాన్ని పంచుకునేందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నా" అని తెలిపాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68